
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 30 జూలై 2024



	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	33	26
భద్రాద్రి	18	25


భద్రాచలం వద్ద గోదావరి వరద

- మూడు రోజులుగా ముంపులోనే భద్రాచలంలోని అశోక్‌నగర్ కొత్తకాలనీ
- పునరావాస కేంద్రంలోనే వరద బాధితులు
- నేడు మళ్లీ పెరగనున్న గోదావరి నీటిమట్టం
- మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

దేవస్థానం స్నాన ఘట్టాల వద్ద వరద ప్రవాహం

ఆ కాలనీ ఇంకా నీటిలోనే..

6


వైరాలోని మధిర-జగ్గయ్యపేట రోడ్డు పక్కన కూల్చివేసిన దుకాణాల శిథిలాలు

ఏన్నాళ్లీ శిథిల దృశ్యాలు

- వైరాలో నిరుపయోగంగా రూ.100కోట్ల ప్రభుత్వ స్థలాలు
- మూడేళ్ల కిత్రం అక్రమ నిర్మాణాల కూల్చివేత
- షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి 'స్టే' అడ్డంకులు
- అధికారుల్లో చిత్తశుద్ధి లేదని స్థానికుల విమర్శలు

6

డిగ్రీ విద్యార్థి హత్య కేసులో

11మంది అరెస్ట్

- వారిలో 10మంది మైనర్లు.. జువైనల్ హోంకు తరలింపు

పాల్వంచ, జూలై 29: పాల్వంచలో సంచలనం సృష్టించిన డిగ్రీ కళాశాల విద్యార్థి హత్య కేసులో పోలీసులు సోమవారం 11 మందిని అరెస్ట్ చేశారు. హత్యతో సంబంధం ఉందనే అనుమానంతో ఆదివారం ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పాల్వంచ రూరల్ పోలీసులు మరో ఐదుగురుకి ప్రత్యక్షంగా ఈ కేసుతో సంబంధం ఉందనే విషయాన్ని విచారణలో తెలుసుకున్నారు. దీంతో ఈ కేసుతో సంబంధం ఉన్న మొత్తం 11మందిని అరెస్ట్ చేశారు. వారిలో 10మంది విద్యార్థులు మైనర్లు కావడంతో జువైనల్ హోంకు తరలించారు. మిగిలిన ఒకరు మేజర్ కావడంతో అతడిని మంగళవారం కోర్టులో హాజరుపరిచే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. కాగా ఈ కేసులో నిందితులుగా ఉన్నవారందరూ మైనర్లు కావడంతో పోలీసులు ఈ విషయాలన్నింటినీ గోప్యంగా ఉంచుతున్నారు.


బియ్యం నిల్వల వివరాలను పరిశీలిస్తున్న రాయల నాగేశ్వరరావు

బతుకమ్మ చీరలను వెంటనే

ప్రభుత్వానికి పంపాలి


- రైతులు, ప్రభుత్వ అవసరాలకే గోదాంలను ఉపయోగించాలి
- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు

రఘునాథపాలెం, జూలై 29: ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం జింకలతండా గోదాముల్లో నిల్వ ఉన్న 50వేల చీరలను వెంటనే ప్రభుత్వానికి పంపాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. జింకలతండా ప్రభుత్వ గోదాములను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వర్షానికి తడిసి ముద్దగా మారిన బతకమ్మ చీరలను, నిల్వ ఉంచిన బియ్యం, ఎరువులను రాయల పరిశీలించారు. ఈ విషయాన్ని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఫోన్‌లో వివరించారు. అనంతరం సంబందిత శాఖల రాష్ట్ర స్థాయి అధికారులతో రాయల నాగేశ్వరరావు మాట్లాడారు. గోదాములను రైతుల ప్రయోజనాలకు, ఇతర ప్రభుత్వ అవసరాలకు వినియోగించే విషయాలపై స్థానిక అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జావీద్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భూక్య బాలాజీనాయక్ ఆధ్వర్యంలో రాయల నాగేశ్వరరావును సన్మానించారు.

భద్రాద్రికి అధిక నిధులివ్వండి

- కరకట్ట నిర్మాణానికి రూ.3వేల కోట్లు కేటాయించాలి
- మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్

వివరాలు : 6లో


పాలేరు రిజర్వాయర్ పరిధిలో పెంచుతున్న వరి నారు మళ్లు



బిరబిరా కృష్ణమ్మ..

వానాకాలం సాగుపై కృష్ణా పరివాహక ప్రాంత రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. ఎగువ నుంచి కృష్ణానదికి భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో ఈసారి వరి సాగుకు ఢోకా లేదనే ధైర్యంతో రైతులు సాగు పనులు ముమ్మరం చేస్తున్నారు. ఎగువన కర్నాటకలో కురుస్తున్న భారీ వర్షాలతో అల్మట్టి, నారాయణపూర్, జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. భారీగా వరదనీరు వస్తుండటంతో సోమవారం శ్రీశైలం నుంచి సాగర్ డ్యామ్‌కు నీరు విడుదల చేశారు.

- కృష్ణా పరివాహక ప్రాంతంలో నిండిన ప్రాజెక్టులు
- శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు నీటి విడుదల
- సాగర్ ఆయకట్టులో చిగురిస్తున్న ఆశలు
- నాగార్జున సాగర్ నిండితే వారం రోజుల్లోనే ఆయకట్టుకు నీరు
- రెండో జోన్ పరిధిలో 2.50లక్షల సాగుకు అవకాశం

కూసుమంచి, జూలై 29: గత ఏడాది కృష్ణా పరివాహక ప్రాంతంలో సరైన వర్షాలు లేకపోవడంతో ఆయకట్టులో క్రాప్ హాలిడే ప్రకటించారు. సాధారణంగా ఆగస్టులో ప్రాజెక్టులు నిండుతాయి. కానీ ఈ ఏడాది జూలైలోనే ప్రాజెక్టుల్లో నీరు చేరి నిండిపోయాయి. శ్రీశైలం పాజెక్టులోకి గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులకుగాను 876.70 అడుగులకు చేరింది. జూరాల, తుంగభద్ర ప్రాజెక్టుల నుంచి సుమారు 4.27లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా శ్రీశైలం ప్రాజెక్టునుంచి తొమ్మిది గేట్లు ఎత్తి సుమారు 2లక్షల క్యూసెక్కుల నీరు దిగువ సాగర్‌కు వదులుతున్నారు. శ్రీశైలానికి వరద భారీగా వస్తుండటంతో అదేస్థాయిలో దిగువకు నీటివిడుదల పెంచే ఆవకాశం ఉంది. మరో 15రోజుల పాటు ఇదేస్థాయిలో నీటి ఉధృతి ఉంటుందని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. నాగార్జునసాగర్ గరిష్ఠ నీటిమట్టం నీటిమట్టం 590 అడుగులు కాగా 511.4 అడుగుల మేర నీటి నిల్వ ఉంది. రోజుకు 40 టీఎంసీల నీరు వస్తుండటంతో వారంలోనే సాగర్ నిండే అవకాశం ఉంది.

సాగర్ నిండితే వారంరోజుల్లోనే ఆయకట్టుకు నీరు

శ్రీశైలం ప్రాజెక్టుకు 4లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. సాగర్ జలాశయానికి సుమారు 2లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. వరద భారీగా చేరుతున్నందున అదేస్థాయిలో సాగర్‌కు విడుదల చేసే అవకాశం ఉందని ఐబీ అధికారులు చెబుతున్నారు. నాగార్జుసాగర్ పూర్తి సామర్థ్యం 350 టీఎంసీలు కాగా ప్రస్తుతం 134 టీఎంసీల నీరు చేరింది. రోజుకు 40 టీఎంసీల నీరు వస్తే వారం రోజుల్లో సాగర్‌డ్యామ్ నిండే అవకాశం ఉంది. అంటే వారంలో సాగర్ ఆయకట్టుకు అధికారులు నీరు విడుదల చేసే అవకాశం ఉంది.

2.50లక్షల ఎకరాల్లో సాగు

కృష్ణా పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో ఆయకట్టులో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సాగర్ నిండితే ఈ ఏడాది నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లోని 1, 2, 3 జోన్ల పరిధిలో సాగుకు నీరు విడుదల చేసే అవకాశం ఉంది. గత ఏడాది వర్షాలు లేకపోవడంతో రైతులు వరి సాగుచేసుకోలేకపోయారు. ఈ ఏడాది మాత్రం వరుణదేవుడు కరుణించడంతో ఆశలు రేకెత్తుతున్నాయి. ఖమ్మం జిల్లా రెండోజోన్ పరిధిలో 2.50 లక్షల ఎకరాలు సాగయ్యే అవకాశం ఉంది.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు


ప్రాజెక్టు	గరిష్ఠ నీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నీటిమట్టం	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	1705	1691	2,71,385
నారాయణపూర్	1615	1607	3,10,371
జూరాల	1045	1042	3,03,254
శ్రీశైలం	885	876	4,27,000
నాగార్జునసాగర్	590	511.4	2,00,000
పాలేరు	23	17.1	నిల్


పాలేరు జలాశయం

రైతుబీమాతో ధీమా

- బాధిత కుటుంబానికి బాసటగా రాష్ట్ర ప్రభుత్వం
- ఆగస్టు 5 వరకు కొత్త వారికి అవకాశం

6



- జిల్లాతో ఏపీ రాజధానిని అనుసంధానిస్తూ రైల్, రోడ్డు మార్గాలు
- ఎర్రుపాలెం టూ అమరావతి ప్రత్యేక రైలుమార్గం
- జిల్లా నుంచే వెళుతున్న నాగపూర్-అమరావతి హైవే

అమరావతికి కొత్త రూట్

ఖమ్మం, జూలై 29(ఆంధ్రజ్యోతిప్రతినిధి): తెలంగాణ-ఆంధ్రాకు గుమ్మంగా ఉన్న ఖమ్మం జిల్లాలో కొత్తగా రాబోతున్న రైలుమార్గం, గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారితో అమరావతితో జిల్లా అనుసంధానం కాబోతోంది. ఈ రెండు మార్గాల నిర్మాణంతో రాబోయే ఐదేళ్లలో జిల్లా రవాణారంగంలో పెనుమార్పులు రాబోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో ఎర్రుపాలెం నుంచి అమరావతికి (నంబూరు)55.8కి.మీ. ప్రత్యేక రైలుమార్గాన్ని మంజూరు చేసింది. ప్రస్తుతం ఎర్రుపాలెం మీదుగా విజయవాడకు ఒక రైలుమార్గం వెళుతుండగా ఏపీ రాజధాని అమరావతికి ఎర్రుపాలెం నుంచి మరో రైలుమార్గం రూ.2,047కోట్లతో నిర్మించబోతున్నారు. త్వరితగతిన ఈ రైలుమార్గం పూర్తిచేసేందుకు ఇప్పటికే డీపీఆర్ పూర్తికాగా ఇక భూసేకరణ చేపటనున్నారు.

ఎర్రుపాలెం మండలంలో సుమారు 4.50హెక్టార్ల వరకు భూసేకరణ జరగనుంది. ఈ కొత్త రైలు ట్రాక్ నిర్మాణం పూర్తయితే విజయవాడతో సంబంధం లేకుండా ఏపీ రాజధాని అమరావతికి ట్రైన్ సదుపాయం కలగనుంది.

దీనికితోడు విజయవాడ జంక్షన్‌లో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలకు వెళ్లే రైళ్లు, గూడ్స్‌ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక్కడ ట్రాక్‌లను క్లియర్ చేసేందుకు రైల్వేశాఖ అధికారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎర్రుపాలెం-అమరావతి రైలుమార్గంతో సుదూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లు విజయవాడ వెళ్లకుండా అమరావతి మీదుగా రాకపోకలు సాగిస్తే విజయవాడ స్టేషన్‌లో ట్రాఫిక్ సమస్య తొలుగుతుంది. ఎర్రుపాలెం-అమరావతి రైల్వేలైన్‌ను 2018లోనే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినా ఏపీలో ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం తీరుతో ఇది నిలిచిపోయింది.

కొత్త రైలుమార్గంలో ఎర్రుపాలెం తర్వాత పెద్దాపురం, చిన్నరావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్లమాను, అమరావతి, తాటికొండ, కొప్పురావూరు మొత్తం 9 స్టేషన్లు ఉంటాయి. వీటిలో పెద్దాపురం, పరిటాల, అమరావతి, కొప్పురావూరులను పెద్దస్టేషన్లుగా నిర్మిస్తారు. జిల్లా పరిధిలోని ఎర్రుపాలెం స్టేషన్ ఆధునీకరణతో పాటు విజయవాడ-అమరావతి వైపు వచ్చి వెళ్లే రైళ్లకు ఎర్రుపాలెం వద్ద కూడా రైల్వేశాఖ సాంకేతికంగా అన్న హంగులు ఏర్పాటు చేయనుంది. జిల్లా సరిహద్దు ప్రాంతాలతో పాటు ఎర్రుపాలెం మండల అభివృద్ధికి ఈ రైలుమార్గం ఉపయోగపడనుంది.

నాగపూర్-అమరావతి రహదారి కూడా

నాగపూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ రహదారి సర్వే పనులు పూర్తికావడంతో జిల్లాలో ఈ రహదారి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఖమ్మం జిల్లాలో 77 కి.మీ పొడవున రూ.2,800 కోట్లతో ఈ హైవెను నిర్మించనున్నారు. ఖమ్మం మీదుగా వెళ్లే నాగపూర్-అమరావతి జాతీయ రహదారి కూడా అమరావతితో జిల్లాను అనుసంధానం చేయనుంది. ఈ హైవే ఎర్రుపాలెం మండలం జమలాపురం ఆలయానికి 6కి.మీ దూరం నుంచి వెళుతుంది అక్కడి నుంచి ఆలయానికి గ్రీన్‌ఫీల్డ్ హైవే అనుసంధానం చేస్తూ రహదారి నిర్మించనున్నారు. ఈ హైవేతో ఏపీలోని గన్నవరం ఎయిర్‌పోర్టుకు వెళ్లేవారు విజయవాడ వెళ్లకుండానే నేరుగా గన్నవరం ఎయిర్‌పోర్టుకు వెళ్లవచ్చు. ఈ రెండు కొత్త మార్గాలతో జిల్లాలోని సరిహద్దు ప్రాంతాలతో పాటు జిల్లా కేంద్రం ఖమ్మానికి కూడా అదనంగా రవాణా ప్రయోజనం కలగనుంది.

'మధిర'పై డిప్యూటీ సీఎం భట్టి ప్రత్యేక దృష్టి

ఎర్రుపాలెం-అమరావతి ప్రత్యేక రైలుమార్గం, నాగపూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ రహదారితో గన్నవరం ఎయిర్‌ఫోర్ట్ మధిర నియోజకవర్గానికి చేరువకాబోతున్నందున డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ఎర్రుపాలెం మండలంలో రెమిడిచర్ల వద్ద ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధి చేయనున్నారు. జమలాపురం ఆలయానికి రవాణా మార్గం అభివృద్ధి చేయడంతో పాటు ఇతర పారిశ్రామిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు.

రూ.6వేలు ఇస్తే లక్ష ఇస్తాం

- ఇద్దరు మహిళల టోకరా..
- బాధితుల ఫిర్యాదుతో ఇద్దరి అరెస్టు

ఖమ్మం క్రైం, జూలై 29: ఖమ్మం నగరానికి చెందిన ఓ మహిళతో పాటు హైదరాబాద్‌కు చెందిన మరో మహిళ కలిసి ఖమ్మం రూరల్ మండలంతో పాటు నగరంలోని పలువురిని రుణాలు ఇప్పిస్తామని మోసం చేశారు. రూ.6వేలు డిపాజిట్ కడితే రూ.లక్ష రుణం ఇస్తామంటూ పలువురిని మోసం చేయగా ఈ కేసులో సోమవారం రాత్రి ఇద్దరు మహిళలను ఖమ్మం టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. సదరు మహిళలు చేసిన మోసంపై పలువురు బాధితులు ఇటీవలే ఖమ్మం టూటౌన్ పోలీసులను ఆశ్రయించగా విచారణ చేసిన పోలీసులు నగరానికి చెందిన భవాని అనే మహిళతో హైదరాబాద్‌కు చెందిన మరో మహిళను సోమవారం రాత్రి అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ సునాయాసంగా డబ్బులు సంపాదించుకోవచ్చని చెప్పే వారి మాటలు నమ్మవద్దన్నారు. అనుమానం వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ అధికారుల పర్యటన

కల్లూరు, జూలై 20 మండలంలోని కొర్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం కేంద్ర ప్రభుత్వ పరిధిలో పలు శాఖల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ సెక్షన్ అధికారులు పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరంగా అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఏ విధంగా అమలు జరుగుతున్నాయి.. ప్రజలు ఎలా లబ్ధి పొందుతున్నారు.. అనే కోణంలో అధికారుల బృందం క్షేత్ర స్థాయిలో పర్యటనలో భాగంగా ప్రజలను కలుసుకొని అభిప్రాయ సేకరణ చేశారు. అందులో ఐకేపీ, విద్య, వైద్య, మహిళ శిశు సంక్షేమం, పంచాయతీరాజ్, వ్యవసాయం తదితర విభాగాలకు సంబంధించిన వాటిపై వారు క్షేత్ర స్థాయిలో ప్రజలను కలిసి అవగహన చేసుకునేలా గ్రామీణ ప్రాంత స్టడీ టూర్‌గా సదరు అధికారుల పర్యటన సాగుతుంది. సోమవారం నుంచి ఇదే గ్రామ పంచాయతీ పరిధిలో నాలుగు రోజుల పాటుగా వారి పర్యటన ఉంటుంది. తొలి రోజున పర్యటనలో భాగంగా పంచాయతీ కార్యాలయంలో మండల స్థాయి అధికారుల సమక్షంలో గ్రామ స్థాయిలో పని చేస్తున్న అంగన్‌వాడీ, ఆశాలు, పంచాయతీరాజ్ ఐకేపీ, విద్య, తదితర శాఖల ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పై విధంగా పర్యటన చేసిన అధికారుల బృందం తరుపున సాహిల్, భువనేష్ పాండే, రోహిత్ గోసైన్, సందీప్ ఠాకూరు, విలాష్ కుమార్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపివో సురేష్‌బాబు, ఐకేపీ ఏపీఎం వెంకటరామారావు, కార్యదర్శి రాం ప్రసాద్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కబడ్డీ పోటీలకు నగర క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 29: సెప్టెంబరు 1వ తేదీ నుంచి నేపాల్ దేశంలో జరగనున్న యూత్ ఇంటర్నేషనల్ అండర్- 17 కబడ్డీ పోటీలకు నగరానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బొడ్డుపల్లి గౌతమ్, ఏఎస్‌ఆర్ కళాశాలకు చెందిన బి. యశ్వంత్ ఎంపికయ్యారు. వారు ఇటీవల గోవాలో జరిగిన 18 వ నేషనల్ యూత్ గేమ్స్ అండర్-17 కబడ్డీ పోటీలలో ప్రతిభ చూపి అంతర్జాతీయ పోటీలకు వెళుతున్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను నయాబజార్ కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, పీడీ రఘు, ఏఎస్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, అధ్యాపకులు అభినందించారు.



ఇనిద్రమ్మ చెరువును పరిశీలిస్తున్న జిల్లా అటవీశాఖ అధికారులు



పర్యాటక అభివృద్ధి ప్రణాళికపై డిప్యూటీ సీఎంతో మాట్లాడుతున్న ఫారెస్ట్ అధికారులు

పర్యాటకం పరుగులుపెట్టేనా..?

- మధిర, ఎర్రుపాలెంలో అవకాశాలు పుష్కలం
- నిత్య పూజలతో విరాజిల్లుతున్న జమలాపురం
- ఆకట్టుకుంటున్న పెనుగంచిప్రోలు, నెమలి
- అటవీ ప్రాంతంలో గుబ్బలమంగమ్మ ఆలయం
- కనివిందుచేసే జాలిముడి ప్రాజెక్టు ప్రాంతం
- పుణ్యక్షేత్రాలకు నిలిచిన ఆర్టీసీ సర్వీసులు
- ఉప ముఖ్యమంత్రి భట్టి చొరవతో పనుల్లో కదలిక

మధిర, జూలై 29: మధిర నియోజకవర్గంలో పర్యాటకం అభివృద్ధి దశాబ్దాలుగా ఊరిస్తూనే ఉంది. గతంలో ప్రభుత్వాలు అభివృద్ధి ప్రకటనలు చేసినా కార్యాచరణకు నోచుకోలేదు. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి డిప్యూటీ సీఎంగా మల్లు భట్టి విక్రమార్క బాధ్యతలు చేపట్టడంతో మళ్లీ ప్రజల్లో ఆశలు చిగురించాయి. నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉన్న భట్టి ప్రత్యేక శ్రద్ధతో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కదలిక వచ్చింది.

మధిర, ఎర్రుపాలెం మండలాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవకాశాలు ఉన్నాయి. మధిర ట్యాంక్ బండ్‌తోపాటు జాలిముడి ప్రాజెక్టు ప్రాంతం, జమలాపురంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం గుట్ట, జమలాపురం చెరువు, బుచ్చిరెడ్డిపాలెంలోని చెరువును పర్యాటక ప్రాంతాలుగా గుర్తించారు. జమలాపురం దేవాలయం పక్కనే ఉన్న గుట్టపై అర్బన్ పార్కు ఏర్పాటు, చెరువుపార్కును మరింత అభివృద్ధి చేసి బోటు షికారు ఏర్పాటు చేయాలి. చెరువు, గుట్ట అభివృద్ధికి ప్రణాళికలు వేయాల్సిందిగా అధికారులను భట్టి ఆదేశించడంతో కదలిక మొదలైంది.

ఎర్రుపాలెం మండలంలో ఎక్కువగా అటవీ ప్రాంతం ఉండటంతో అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యాటక అభివృద్ధికి ఆశాఖ ప్రణాళికలు తయారుచేసింది. చెరువుల అభివృద్ధితో పాటు బోటు షికారు, పార్కులు ఏర్పాటు ప్రజలకు ఆహ్లాదం పంచేలా పలు రకాల ఎగ్జిబిషన్ల ఏర్పాటు, పచ్చదనం పెంచడం, సదుపాయల ఏర్పాటు తదితర వాటి కోసం ప్రణాళికలు తయారుచేశారు. మొత్తం రూ.20కోట్లకు డీఎఫ్‌వో ఆధ్వర్యంలో ప్రణాళికలు తయారుచేసి డిప్యూటీ సీఎంకు అందజేసినట్లు ఎఫ్‌ఆర్‌వో విజయలక్ష్మి తెలిపారు.

సత్యనారాయణపురం గుబ్బల మంగమ్మతల్లి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అనువుగా ఉంటుందని ఫారెస్ట్ అధికారులు భట్టి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతీ సంవత్సరం ఇక్కడ గుబ్బలమంగమ్మ తల్లికి బోనాల వైభవంగా జరుగుతాయి. జాలిముడి ఆనకట్ట ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని గతంలో భట్టి విక్రమార్క చెప్పారు. పట్టణంలోని పెద్దచెరువుపై ఉన్న మినీ ట్యాంక్ బండ్‌ను అభివృద్ధి చేసేందుకు భట్టి విక్రమార్క రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికల ముందు పార్కు విస్తరణ పనులకు ఆయన శంకుస్థాపన కూడా చేశారు. అయితే ఈ పనులు ఆదిలోనే ఆగిపోయాయి.

నియోజకవర్గంలోని అతిపెద్ద పుణ్యక్షేత్రం జమలాపురానికి తెలంగాణ నుంచి ఒక్క ఆర్టీసీ బస్సు నడవడంలేదు. వచ్చే బస్సులన్నీ ఏపీ రాష్ట్రంనుంచే వస్తున్నాయి. మధిర డిపో పరిధిలోనే ఉన్నా నిర్వహణ లేక అస్తవ్యస్తంగా తయారైంది. మధిరకు సమీపంలో మూడువైపులా మూడు పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. 25కి.మీ దూరంలో జమలాపురం దేవాలయం,15కి.మీ దూరంలో పెనుగంచిప్రోలు తిరుపతమ్మ,20 కి.మీ. దూరంలో నెమలి శ్రీకృష్ణుని పుణ్యక్షేత్రం ఉంది. ఈరెండు ఏపీ రాష్ట్రంలోవి. వీటిని దర్శించుకొనేందుకు నిత్యం భక్తులు భారీగా వస్తుంటారు. శుభకార్యాలకు ముందు పెనుగంచిప్రోలు, నెమలిలో శ్రీవేణుగోపాల స్వామి దేవాలయానికి వెళ్లడం ఆనవాయిగా వస్తున్నది. తెలంగాణ ఏర్పాటు తర్వాత రూట్ పర్మిట్ ఇబ్బందులతో నెమలి, పెనుగంచిప్రోలుకు బస్సులు నడపడం లేదు. ఉప ముఖ్య మంత్రి భట్టి ఆ రూట్లకు అనుమతులు తీసుకొని మూడు పుణ్యక్షేత్రాలను కలుపుతూ మధిర డిపోనుంచి బస్సులు నడిపితే ప్రజలకు, ముఖ్యంగా భక్తులకు సౌకర్యవంగా ఉంటుంది.

సివిల్స్ కోచింగ్ అభ్యర్థుల మృతి విచారకరం

- రాజ్యసభలో ప్రస్తావించిన వద్దిరాజు

ఖమ్మం కార్పొరేషన్, జూలై 29: ఐఏఎస్ సాధించాలనే లక్ష్యంతో ఢిల్లీలో శిక్షణ తీసుకుంటున్న ముగ్గురు అభ్యర్థులు వరదల్లో చిక్కుకొని మృతిచెందటం విచారకరమని బీఆర్ఎస్ పార్లమెంటరీ ఉపనేత వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. సోమవారం రాజ్యసభలో ఈ సంఘటనను ప్రత్యేకంగా ప్రస్తావించారు. తెలంగాణాలోని మంచిర్యాలకు చెందిన తాన్యా సోని, కేరళకు చెందిన నవీన్ దల్విన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్రేయా యాదవ్ ఐఏఎస్ సాధించాలనే సంకల్పంతో శిక్షణ తీసుకుంటూ, జలసమాధి కావటం అత్యంత బాధాకరమన్నారు. భారీ వర్షం వల్ల కోచింగ్‌సెంటర్‌లోని బేస్‌మెంట్‌లో వరద వచ్చి ముగ్గురు దుర్మరణం కావటం పట్ల బీఆర్ఎస్ పక్షాన తీవ్ర సానుభూతి వ్యక్తం చేస్తున్నామన్నారు. తమ నేతలు కేసీఆర్, కేటీఆర్ సోని కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారన్నారు. ఇటువంటి తప్పిదాలు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వద్దిరాజు రాజ్యసభలో కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిన కోడిగుడ్లు

- పట్టించుకోని అధికారులు

అశ్వాపురం జూలై 29: బూర్గంపాడు ఐసీడీఎస్ పరిధిలోని అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లోన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు గత వారం రోజులుగా మురిగిన కోడిగుడ్లు సరఫరా అవుతున్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు రోజువారీగా పౌష్టికాహారంలో భాగంగా కోడిగుడ్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఈవిధంగా పంపిణీ చేయాల్సిన కోడిగుడ్లలో పూర్తిగా కుళ్లిపోయిన గుడ్లు దర్శనమిస్తుండటంతో టీచర్లు అయోమయానికి గురవుతున్నారు. నాలుగు రోజుల క్రితం మండల పరిధిలోని మల్లెలమడుగు అంగన్‌వాడీ కేంద్రంలో పంపిణీ చేసినగ్రుడ్లను లబ్ధిదారులు బయట పారేసినట్లు సమాచారం. ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే క్రుళ్లిన కోడిగుడ్లు అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి.అసలే వర్షాకాలం పౌష్టికాహారం అందించాల్సిన సమయంలో మురిగిన క్రోడిగుడ్లు సరఫరా .రుగుతుండటంపై సంబంధిత అధికారులు దృష్టిసారించి మెరుగైన కోడిగుడ్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



రైతుబీమాతో ధీమా

- బాధిత కుటుంబానికి బాసటగా ప్రభుత్వం
- జిల్లాలో 4,436 కుటుంబాలకు రూ.221.50 కోట్ల లబ్ధి
- ఆగస్టు 5 వరకు కొత్త వారికి అవకాశం

ఖమ్మం వ్యవసాయం, జూలై 29: బాధిత రైతు కుటుంబాలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకొచ్చింది. అన్నదాతలకు అత్యంత ప్రయోజనకారిగా ఉన్న రైతు బీమా పథకాన్ని కొనసాగిస్తూ 2023 బడ్జెట్‌లో రూ.1,500 కోట్లు కేటాయించడంతో రైతుబీమా పథకంపై ధీమా ఏర్పడింది. 2024కు సంబంధించి ఆగస్టులో ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో ఈ పథకం ప్రారంభించినప్పటినుంచి ఇప్పటి వరకు 4,436 మంది బాధిత కుటుంబాలకు రూ.221.50 కోట్ల పరిహారం అందింది.

ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి..

అన్నదాత కుటుంబంలో ఇంటి పెద్ద చనిపోతే భార్య, పిల్లలను ఆర్థికంగా ఆదుకునేందుకు 2018 ఆగస్టు 19న గత ప్రభుత్వం ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. వార్షిక ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేలా ఎల్ఐసీతో ఒప్పందం ఉంది. ఒక్కో రైతు పేరున ప్రభుత్వం రూ.3,600 చొప్పున ప్రీమియం చెల్లిస్తోంది. 2023 ఆగస్టు 19 వరకు గత ప్రభుత్వం ప్రీమియం చెల్లించినా ఈ ఏడాది ఆగస్టులో మళ్లీ ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. తాజాగా ప్రభుత్వం 2024 జూన్ 28 వరకు పట్టాదారు పాస్ పుస్తకం కలిగి ఉండి 18 నుంచి 59 సంవత్సరాల వయసున్న రైతులు 2024 రైతు బీమాకు అర్హులని ప్రకటించింది. వారందరూ రైతు బీమాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు సూచించారు.

బాధిత కుటుంబాలకు లబ్ధి ఇలా..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 18 నుంచి 59 ఏళ్లలోపు ఉన్నవారు ఈ పథకానికి అర్హులుగా గుర్తించారు. రైతు అకాల మరణం చెందితే ఆధార్‌కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతాతో పాటు నామిని పత్రాలు అందిస్తే రూ.5లక్షల పరిహారం వారి ఖాతాలో జమ అయ్యేలా క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణాధికారులు చర్యలు తీసుకుంటారు. 2018-19లో 813 కుటుంబాలకు రూ.40.65కోట్లు, 2019-20లో 840కుటుంబాలకు రూ.42కోట్లు, 2020-21లో 1,195కుటుంబాలకు రూ.59.75కోట్లు 21-22లో 897 కుటుంబాలకు రూ.44.85కోట్లు, 22-23లో 685 కుటుంబాలకు రూ.34.25 కోట్లను బీమ కంపెనీల నుంచి చెల్లించారు.

కొత్తవారు పేర్లు నమోదు చేసుకోవాలి

కొత్తగా అర్హత కలిగిన రైతులు 2024 ఆగస్టు 5లోగా పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్ కార్డు, నమోదు పత్రంతో ఏఈవో సమక్షంలో పేర్లు నమోదు చేసుకోవాలి. నమోదు పత్రంపై బీమా పొందే రైతు స్వయంగా వేలిముద్ర గానీ, సంతకం గానీ చేయాల్సి ఉంటుంది. గతంలో బీమా కలిగి ఉన్న వారు మార్పులు, చేర్పులకు 2024 జులై 30 వరకు అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

వన మహోత్సవంలో అందరు పాల్గొనాలి

- పుట్టిన రోజు సందర్భంగా మొక్కను నాటిన సీఎండి బలరాం

కొత్తగూడెం/ లక్ష్మీదేవిపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో అందరు ఉత్సాహంగా పాల్గొనాలని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్. బలరాం పిలుపునిచ్చారు. సోమవారం తన పుట్టిన రోజును పురష్కరించుకుని సింగరేణిభవన్‌లో ఆయన మొక్కను నాటి మాట్లాడారు. ఉద్యోగులు కూడా తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించడాన్ని యజ్ఞంగా స్వీకరించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సింగరేణి సీఎండీ ఎన్. బలరాం పుట్టిన రోజు సందర్భంగా లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ రామవరంలోని బౌద్ధారామంలో 116 శ్రీ గంధం మొక్కలను నాటి అనంతరం కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. బౌద్ధారామాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో సింగరేణి కాలరీస్ సీఎస్‌ఆర్ నిధుల నుంచి రూ.20లక్షలను మంజూరు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జీఎం పర్సనల్ ఆనందరావు, ఎస్‌బీఐ సీఐ చెన్నూరు శ్రీనివాసరావు, కొచ్చెర్ల కమలారాణి, జి. మాల కొండయ్య, బచ్చా, కలవల చంద్రశేఖర్‌రావు, మల్లేష్, రాయల రాజేశ్వరరావు, విజేందర్, మోరె రమేష్, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కను నాటిన సింగరేణి సీఎండి బలరాం

భద్రాచలానికి అధిక నిధులు ఇవ్వండి

- కరకట్ట నిర్మాణానికి రూ.3వేల కోట్లు కేటాయించాలి
- లోక్‌సభలో మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్

భద్రాచలం జూలై 29: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య రామ మందిరానికి ఇచ్చిన విధంగానే దక్షిణ అయో ధ్యగా పేరుప్రఖ్యాతి గాంచిన భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయానికి అధిక నిధులు ఇవ్వాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో భద్రాచలం అభివృద్ధికి నిధులు కేటాయించాలని సోమవారం ఎంపీ బలరాంనాయక్ కోరారు. అయోధ్య రామ మందిరానికి వేలా ది కోట్ల రూపాయలు కేటాయించి అభివృద్ధి చేసిన విధంగా తెలంగాణలోని భద్రాచలంలో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రానికి అధిక నిధులు కేటాయించాలన్నారు. భద్రాచలంలో 25కి.మీ మేర కరకట్టను నిర్మించేందుకు రూ.3వేల కోట్లు కేటాయించాలని కోరారు. భద్రాచలం ప్రాంత ఆదివాసీలకు వరదల వల్ల ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. భద్రాచలం వద్ద శ్రీరాముడి పాదాలు తాకుతూ ప్రవహించే గోదావరి నదిపై కరకట్టలు నిర్మించేందుకు ప్రత్యేక గ్రాంట్ ఇవ్వాలని, వరదలు వచ్చిన సమయంలో గోదావరి నది ఉగ్రరూపం దాల్చితే గ్రామాలు, రోడ్లు, పొలాలు కొట్టుకుపోతాయని సభ దృష్టికి తీసుకువచ్చారు.

1983 లో కట్టిన కరకట్టలు బలహీన పడ డంతో వరదలు వచ్చిన సమయంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని తద్వారా ఏజెన్సీలోని ఆదివాసీ ప్రజలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోతున్నారని చెప్పారు. శాశ్వత పరిష్కారం కోసం భద్రాచలం నుంచి దుమ్ముగూడెం వరకు 25కి.మీ మేర గోదావరి నదికి ఇరువైపులా కరకట్టలు నిర్మించేందుకు ప్రత్యేక గ్రాంటును విడుదల చేయాలని కోరారు. అయోధ్య రాముడికి వేల కోట్లు ఖర్చు చేసిన తరహాలోనే భద్రాద్రి రాముడికి నిధులు వెచ్చించాలని ఎంపీ బలరాంనాయక్ విజ్ఞప్తి చేశారు.



లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్

ఎమ్మెల్యే కోరం తీరుపై సీఎంను కలుస్తాం

- ఏకపక్షంగా వ్యవహరిస్తూ అవమానిస్తున్నారు
- గార్ల మండలానికి చెందిన పలువురు నేతల ఆరోపణ
- పుల్లూరులో సమావేశమైన ముఖ్య నాయకులు

గార్ల, జూలై 29: గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచి పార్టీ ఫిరాయించి బీఆర్ఎస్‌లో చేరి.. మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చి ఇల్లెందు టికెట్ దక్కించుకున్న కోరం కనకయ్య గెలుపులో తాము కీలక పాత్ర పోషించామని, కానీ ఆయన నియోజకవర్గంలో ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమను అవమానపరుస్తున్నాడని మహబూబాబాద్ జిల్లా గార్ల మండలానికి చెందిన పలువురు నాయకులు ఆరోపించారు. సోమవారం గార్ల మండలంలోని పుల్లురు గ్రామంలో సమావేశమైన పలువురు ముఖ్యనాయకులు మాట్లాడుతూ తాము కోరం కనకయ్య గెలుపునకు ఎంతో కృషి చేశామని, కానీ ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత కనకయ్య తీరులో మార్పు రాకపోగా గతంలో చేసిన విధంగానే ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. ఈ విషయంలో తాము త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పరిస్థితిని వివరిస్తామన్నారు. ఎమ్మెల్యే మండలాల వారీగా తన ముఖ్య అనుచరులను ఏర్పాటు చేసుకొని, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూడా ఏ ఆఫీసుకు వెళ్లినా ఏపని కాకుండా అడ్డుకుంటూ అవమాన పరుస్తున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తన మనుషులు చెబితేనే పనులు చేయాలని అధికారులకే హుకుం జారీ చేస్తున్నాడని ఆరోపించారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఎన్నికల్లో ఆయన గెలుపునకు పనిచేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పాటు నాడు మద్దతు తెలిపిన పలు పార్టీల నాయకులను కూడా కలుపుకొని సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని, అలాగే ఎమ్మెల్యే తీరుకు నిరసనగా ఆగస్టు 4వతేదీ నుంచి 7వ తేదీ వరకు గార్ల మండల కేంద్రంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రావూరి వెంకట్రామయ్య, సూరపురెడ్డి వెంకటరెడ్డి, గుండా వెంకట్‌రెడ్డి, జాస్తి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ వెంకట్‌లాల్ పాల్గొన్నారు.

ఆ కాలనీ ఇంకా నీటిలోనే..

- మూడు రోజులుగా ముంపులోనే భద్రాచలంలోని అశోక్‌నగర్ కొత్తకాలనీ

భద్రాచలం, జూలై 29: వర్షాకాలంలో వరదల సీజన్ వచ్చిందంటే వారంతా ఇంట్లో ఉన్న సామగ్రి అంతా చేతపట్టుకొని పునరావాస కేంద్రానికి తరలాల్సిందే.. ఇలా ఒక సంవత్సరమో రెండేళ్లో కాదు.. దశాబ్దాలుగా వారు ఈ అవస్థలు అనుభవిస్తున్నారు. భద్రాచలంలోని అశోక్‌నగర్ కొత్తకాలనీ వాసులకు ఏటా వరద కష్టాలు తప్పడం లేదు. అంతా నిరుపేదలే ఉండే ఆ కాలనీ గోదావరి కరకట్ట స్లూయిస్ పక్కనే ఉండటంతో ఏటా వారికి వరద నీటిముంపు సమస్య తప్పడం లేదు. ఈ కాలనీలో మొత్తం 60 ఇళ్లల్లో 75 కుటుంబాలకు చెందిన వారు ఉన్నారు. వీరుండే స్థలం కూడా ఓ దాత ఇచ్చిన పట్టా భూమి కావడం గమనార్హం. ఈ ఏడాది సైతం వరదల సీజన్‌లో వరద సమస్య కన్నా ఎగువన ఉన్న ఏపీలోని యటపాక నుంచి వాగు పొంగిపొర్లడంతో ఆ ఇళ్లన్నీ నడుంలోతు నీళ్లల్లో మునిగిపోయాయి. మూడు రోజులుగా ఈ కాలనీ వరద నీటిలోనే మునిగి ఉంది. నీటి పారుదల శాఖ అధికారులు ఏర్పాటు చేసిన మోటార్లు పూర్తిస్థాయి సామర్థ్యంతో లేకపోవడంతో సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో వరద నీరు ఇంకా ఇళ్ల చుట్టూనే ఉంది. కాలనీలో నడుం లోతు నీళ్లు ఉండటంతో సంబంధిత ఇంటి యజమానులు సైతం అక్కడికి వెళ్లే పరిస్థితి లేదు. దీంతో తమ ఇంట్లోని సామగ్రి ఇతరత్రా ఎలా ఉన్నాయోనని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టినా ఇంకా వరద 40 అడుగులపైనే ఉండటంతో అశోకనగర్ కొత్తకాలనీ వద్ద స్లూయిస్ గేట్లను సైతం తెరిచే పరిస్థితి లేదు. ఈ క్రమంలో మంగళవారమైనా ముంపు సమస్య తప్పుతుందని భావించిన బాధితులకు మళ్లీ గోదావరి నీటిమట్టం పెరుగుతుందని సమాచారం అందడంతో ఆందోళన చెందుతున్నారు.



అశోకనగర్ కొత్తకాలనీ వద్ద ఇంకా వరద నీరు నిలిచి ఉన్న దృశ్యం

నేడు మళ్లీ పెరగనున్న గోదావరి నీటిమట్టం

భద్రాచలం వద్ద రెండు రోజులుగా తగ్గుముఖం పట్టిన గోదావరి మంగళవారం మళ్లీ పెరగనుంది. ఎగువన కురిసిన భారీ వర్షాలతో వాజేడు మండలం పేరూరు వద్ద నీటిమట్టం క్రమేపీ పెరుగుతుండటంతో ఆ ప్రభావం భద్రాచలంపై పడనుంది. దీంతో నేటి నుంచి గోదావరి మరోసారి ఉధృతంగా ప్రవహించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా భద్రాచలం వద్ద ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు 47.1అడుగులుగా ఉన్న గోదావరి నీటిమట్టం సోమవారం ఉదయం 6 గంటలకు 45.7 తగ్గింది. ఈ క్రమంలో రాత్రి 9గంటలకు 42.9అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాదహెచ్చరికను ఉపసంహరించారు. అయితే రాత్రి మళ్లీ పెరిగే అవకాశం ఉంది. భద్రాచలం వద్ద దేవస్థానం స్నానఘట్టాల వద్ద ఇంకా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో పోలీసులు ఎవరిని లోపలికి అనుమతించడం లేదు. ఇదిలా ఉండగా బ్యాక్‌వాటర్ ప్రభావంతో భద్రాచలంలోని అశోకనగర్ కొత్త కాలనీ గత మూడు రోజులుగా నీటిలోనే ఉంది. వరద బాధితులు ఇంకా పునరావాసకేంద్రాల్లో తలదాచుకున్నారు.

ఏన్నాళ్లీ శిథిల దృశ్యాలు

- వైరాలో నిరుపయోగంగా

రూ.100కోట్ల ప్రభుత్వ స్థలాలు

వైరా, జూలై 29: వైరాలో ప్రధాన రహదారి పక్కన సుమారు రూ.100కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు శిథిల దిబ్బగా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ అధికారుల నిర్లిప్తతతో ఆయా స్థలాలకు ఈ పరిస్థితి దాపురించింది. వైరాలోని జాతీయ ప్రధాన రహదారి పక్కన అలాగే మధిర-జగ్గయ్యపేట ఆర్‌అండ్‌బీ రహదారి పక్కన ఆర్ అండ్‌బీ, నీటిపారుదలశాఖ, క్రీడాశాఖకు చెందిన స్థలాలను కొందరు ఆక్రమించి దశాబ్దాలుగా వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేశారు. అయితే 2021 డిసెంబరులో అప్పటి కలెక్టర్ వీపీ.గౌతమ్ ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన స్థానిక రెవెన్యూ, పోలీసు, మునిసిపల్‌శాఖల అధికారులు సుమారు 50అక్రమ దుకాణాలను కూల్చివేశారు. ఇంకా 19మంది హైకోర్టు నుంచి స్టే తెచ్చుకొని ఈ స్థలాల్లోనే తిష్ట వేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రెవెన్యూ, మునిసిపల్‌శాఖల అధికారులు ముందుగా హైకోర్టు స్టే పరిష్కారానికి చొరవ చూపకుండా అనాలోచిత చర్యలు చేపట్టారనే విమర్శలున్నాయి. ముందుగా హైకోర్టులో స్టేను తొలగింపజేసి ఆ తర్వాత ఏకమొత్తంగా ఈ ఆక్రమణలు తొలగిస్తే నేడు వైరాలో ప్రధాన రహదారుల వెంట శిథిలాల దిబ్బలు దర్శనమిచ్చేవి కావని స్థానికులు విమర్శిస్తున్నారు. సదరు ప్రభుత్వశాఖలకు చెందిన స్థలాల్లో సోమవరం రెవెన్యూ సర్వేనెంబర్ 98లో 0.06ఎకరాలు, బ్రాహ్మణపల్లి అగ్రహారం రెవెన్యూ సర్వేనెంబర్ 03లో 0.36ఎకరాలు మొత్తం 1.02ఎకరాల్లోని స్థలాలను ఆక్రమించి కొన్ని దశాబ్దాల తరబడి 69మంది హోటళ్లు, ఫొటోస్టూడియోలు, మెకానిక్ షెడ్‌లు, పండ్ల కొట్లు, పలురకాల వ్యాపార సముదాయాలను నిర్వహిస్తున్నారు. వీరిలో కొద్దిమంది మినహా మిగిలిన వారికి స్థిరచర ఆస్తులు పుష్కలంగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో 59జీవో కింద భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులు చేసుకోగా రెవెన్యూ అధికారులు ఆ దరఖాస్తులను తిరస్కరించారు. అయితే అప్పటి కలెక్టర్ గౌతమ్ ఆదేశాల తో ఎలాంటి కోర్టు వివాదాలు లేని 50మంది దుకాణాలను నేలమట్టం చేశారు. అయితే మిగిలిన 19మంది హైకోర్టు నుంచి స్టే పొంది ఉండటంతో వాటి జోలికి వెళ్లలేదు.

అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని నాటి కలెక్టర్ తలపెట్టిన కార్యం ముందుకు వెళ్లలేదు. అప్పటి ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌ను దుకాణాలు కోల్పోయినవారు కలిసి తాము డిపాజిట్లు చెల్లిస్తామని, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి తాము వాటిలో వ్యాపారాలు నిర్వహించుకొనేందుకుగానూ లీజుకు ఇచ్చేలా హామీ ఇవ్వాలని కోరారు. దాంతో నాటి ఎమ్మెల్యే రాములునాయక్ ఇదే విషయమై కలెక్టర్ వద్దకు వెళ్లి వ్యాపారుల ప్రతిపాదనను ఆయన ముందుంచారు. అయితే మిగిలిన 19మంది కూడా హైకోర్టు స్టేలను తొలగించుకొని స్వచ్ఛందంగా దుకాణాలను తొలగించిన తర్వాత మాత్రమే తాను తీసుకునే నిర్ణయాన్ని వెల్లడిస్తానని స్పష్టం చేశారు. అప్పటి ఎమ్మెల్యే, జిల్లా మంత్రి మధ్య ఉన్న వైరుధ్యాల వల్ల నాటి కలెక్టర్ ఎమ్మెల్యే చేసిన విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోకపోవడంతో సమస్య జఠిలంగా మారిందన్న విమర్శలున్నాయి. ఇక్కడి దుకాణాల వారి విజ్ఞప్తి మేరకు నాటి కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఉంటే ఈ పాటికే వైరాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయి ఉండేదని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. అందుకు భిన్నంగా కలెక్టర్ ఉండటంతో సమస్య పరిష్కారం కాలేదనే విమర్శలు కూడా ఉన్నాయి. ఈ పరిస్థితి ఇలా ఉంటే హైకోర్టులో ఉన్న 19మంది స్టేలను తొలగించేలా మునిసిపల్, రెవెన్యూ అధికారులు గట్టిగా చర్యలు తీసుకోలేదనే విమర్శలు కూడా ఉన్నాయి. వీటన్నింటి కారణంగా వైరాలో అభివృద్ధి కుంటుపడింది. కూల్చివేసిన దుకాణాల శిథిలాల మధ్య మళ్లీ అనేకమంది తాత్కాలిక వ్యాపారాలు మొదలు పెట్టారు. వైరాకే చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వైరాను అభివృద్ధి చేసేందుకుగానూ అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌కు, అధికార పార్టీ నాయకులకు స్పష్టమైన సూచనలు చేశారు. భట్టి సూచనలతో ఎమ్మెల్యే కూడా సానుకూలంగా ఉన్నందున వెంటనే హైకోర్టులోని స్టేలను తొలగింపజేసి దుకాణ సముదాయాన్ని నిర్మించి శిథిలాల దిబ్బల నుంచి వైరాకు విముక్తి కల్పించాలని తద్వారా మునిసిపాలిటీకి ఆదాయాన్ని రాబట్టాలని స్థానికులు కోరుతున్నారు.



హైకోర్టు స్టేతో కొనసాగుతున్న ప్రైవేట్ వ్యక్తుల దుకాణాలు

సొసైటీల్లో నోడ్యూ సర్టిఫికెట్ తప్పనిసరి కాదు

» టెస్కాబ్ అధికారుల మౌఖిక ఆదేశాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వైరా, జూలై 29: రాష్ట్రంలోని సహకార సంఘాల్లో రుణమాఫీ అయిన రైతులకు తిరిగి పంటరుణాలు ఇచ్చేం దుకు నోడ్యూ సర్టిఫికెట్ (బాకీ లేనట్లు ధ్రువపత్రం) తప్పనిసరి కాదని అన్ని సహకార సంఘాలకు టెస్కాబ్ అధికారులు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. 'క్రాప్ లోన్ రెన్యూవల్‌పై కిరికిరి... రైతులకు సంకెళ్లుగా మారిన టెస్కా బ్ ఆదేశాలు' అనే శీర్షికన ఈనెల 27న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై టెస్కాబ్ స్పందించింది. రైతుల నుంచి తీవ్ర విమర్శలు రావడం, 'ఆంధ్రజ్యోతి'లో కథనాన్ని ప్రచురించటం రాష్ట్ర సహకారశాఖ మంత్రి అయిన తుమ్మల నాగేశ్వరరావు దీనిపై టెస్కాబ్ అధికారులకు అక్షింతలు వేయడం వంటి చర్యలతో వారు దిగొచ్చి దిద్దుబాటు ఆదేశాలు జారీ చేశారు. టెస్కాబ్ అధికారుల నుంచి కేంద్ర సహకార బ్యాంకు అధికారులకు వచ్చిన ఆదేశాలను ఆయా సంఘాల సీఈవోలకు మౌఖికంగా జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రూ.రెండులక్షల పథకాన్ని టెస్కాబ్ అపహాస్యం చేస్తుందని విమర్శలు వెల్లువెత్తాయి. మొదటి విడతలో రూ.లక్ష రుణమాఫీ వచ్చిన రైతులకు సహకార సంఘాలు తిరిగి పంటరు ణాలు ఇచ్చేందుకు గానూ అనేక నిబంధనల తో పాటు నోడ్యూ సర్టిఫికెట్‌ను విధిగా సమర్పించాలని నిబంధనలు పెట్టింది. టెస్కాబ్ ఇచ్చిన ఆదేశాలు ప్రభుత్వాని కి తలనొప్పిగా మారడంతో వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టారు. నోడ్యూ సర్టిఫికెట్ తప్పనిసరి కాదని, రుణమాఫీ పొందిన రైతులకు ఇతర ధ్రువపత్రాలను పరిశీలించి పంట రుణాలను రెన్యూవల్ చేయాలని మౌఖిక ఆదేశాలిచ్చారు. అలాగే 15ఏళ్లకు సంబంధించిన ధరణి ఈసీకి బదులు ప్రస్తుత సంవత్సరానికి సంబంధించి ఈసీ మాత్రమే సమర్పిస్తే సరిపోతుందని కూడా దాన్ని పరిగణలోకి తీసుకోవాలని సహకార సంఘాల వారికి టెస్కాబ్ మౌఖికంగా సూచించింది. ఈ చర్యలతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది.

గజ ఈతగాళ్లకు చెల్లింపులేవి?

» 2022 వరదల్లో పని చేసినా ఇంకా ఇవ్వని డబ్బులు
» గత ఏడాది మంత్రి ఇచ్చిన హామీ నెరవేరలేదు


గజ ఈతగాళ్లు (ఫైల్)

భద్రాచలం, జూలై 29: భద్రాచలంలో 2022 జూలైలో వచ్చిన గోదావరి మహా వరదలు భద్రాచలం ఏజెన్సీని అత లాకుతలం చేశాయి. ఆ సమయంలో భద్రాచలం పట్టణం లోని పలు కాలనీలు నీట మునిగాయి. ఈ క్రమంలో అప్పటి అధికార యంత్రాంగం భద్రాచలంలోని 40 గజ ఈతగాళ్లు, 40 బోట్లతో తాము రేయింబవళ్లు ముంపు బాధి తులను ఆదుకునేందుకు కష్టపడ్డా అందుకు రావాల్సిన పూర్తిస్థాయి వేతనం రెండేళ్లయినా రాలేదని గజ ఈతగాళ్లు వాపోతున్నారు. 2022 జూలై 14 నుంచి 26 వరకు గజ ఈతగాళ్లు విధులు నిర్వహించగా వారికి చెల్లించాల్సిన వేత నాలు పూర్తిస్థాయిలో అందలేదనే విమర్శలు వారి నుంచి వినిపిస్తున్నాయి. వాస్తవానికి తమకు రూ.30 వేలపైనే రావాల్సి ఉందని కాని రూ.4 వేల నుంచి రూ.10 వేల వ రకు మాత్రమే చెల్లించారని మిగిలిన మొత్తం ప్రభుత్వం నుంచి వచ్చిన అనంతరం చెల్లిస్తామని ప్రకటించారని గజ ఈతగాళ్లు పేర్కొంటున్నారు. వరదల సమయంలో 40 మంది గజ ఈతగాళ్లు పని చేయగా ఒక్కొక్కరికి షిఫ్ట్‌కి రూ.800 చొప్పున దాదాపుగా అందరికి పూర్తిస్థాయి వేతనా లు అందని క్రమంలో వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై రెండేళ్లు గడుస్తున్నా తమకు అందాల్సిన వేతనాలపై స్పష్టత కరువవడం పట్ల వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు 8 గంటల చొప్పున మూడు షిఫ్ట్‌ల్లో పని చేయించి అనంతరం గజ ఈతగాళ్లకు చెల్లించాల్సిన వేతనాలకు సంబంధించి బిల్లులు చేసి ఆ మొత్తాలను పూర్తిస్థాయిలో చెల్లించడంలో అప్పటి ప్రభుత్వం మొండిచేయి చూపిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2023 జూలై 21న భద్రాచలంలో గోదావరి వ రదల ఉధృతిని పరిశీలించేందుకు వచ్చిన అప్పటి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మీరు డ్యూటీ చేయండి బకా యిలు ఇప్పించే బాధ్యత నాది అని ఇచ్చిన హామీని అమలుకు నోచుకోలేదని వారు విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈసారి గోదావరి వరదల సీజన్‌లో ప్రతి ఏటా మాదిరిగా గజ ఈతగాళ్లను విధుల్లోకి తీసుకోవాల్సిన నీటి పారుదల శాఖ ఆ దిశగా చర్యలే చేపట్టలేదని తెలుస్తోంది. గజ ఈతగాళ్లకు బకాయిలు చెల్లించకపోవడమే ఇందుకు కారణమని సమాచారం. దీంతో భద్రాచలం సీఐ గజ ఈతగాళ్లతో మాట్లాడి ఆపద సమయంలో గజ ఈతగాళ్లు సేవలందించేందుకు రావాలని వారిని కోరగా 9 మంది గజ ఈతగాళ్లు మూడు షిఫ్ట్‌ల్లో విధులు నిర్వరిస్తున్నట్లు తెలు స్తోంది. అయితే ప్రస్తుత ప్రభుత్వం గజ ఈతగాళ్లకు రావా ల్సిన పాత బకాయిలను చెల్లించేందుకు చర్యలు తీసుకోవా లని గజ ఈతగాళ్లు కోరుతున్నారు.

ఆర్‌సీపేట వ్యవహారంపై నేడు విచారణ: ఏటీడీవో

దుమ్ముగూడెం జూలై 29: మండలంలోని రామచంద్రునిపేట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల సామగ్రి తరలింపు వ్యవహారంపై మంగళవారం విచారణ చేపడతామని ఏటీడీఓ అశోక్ సోమవారం తెలిపారు. సామాగ్రి తరలించేందుకు ఉన్నతాధికారుల అనుమతి ఉందా, తీర్మానం చేశారా అనే విషయాల్ని పరిశీలిస్తామన్నారు. ఈనెల 28, 29 సెలవు దినాలు కావడంతో విచారణ ఆలస్యమైందన్నారు. ఈనెల 28న పాత బల్లలు, టేబుళ్లు, పుస్తకాలను ఒక వ్యానులో తరలిస్తుండగా, స్థానిక ఆదివాసీలు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా నిబంధనలకు వ్యతిరేకంగా తరలిస్తున్న వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా సామగ్రితో సహా రవాణకు ప్రయోగించిన వాహనం రెండు రోజులుగా ఆశ్రమపా ఠశాలలోనే ఉంది.

నేడు, రేపు రీసోర్స్ పర్సన్స్‌కు శిక్షణ

» డీఈవో సోమశేఖరశర్మ

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 29: జిల్లాలోని మండల రిసోర్స్ పర్సన్స్‌కు మంగళ, బుధవారాల్లో ఖమ్మం నగరంలోని ప్రభుత్వ విద్యా కళాశాల(డైట్ కళాశాలలో) నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే 2024 అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈవో సోమశేఖర శర్మ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్‌గా డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ వ్యవహరించనున్నారు. మంగళవారం ప్రాథమిక స్థాయి తెలుగు, ఆంగ్లం, ఉన్నత పాఠశాల స్థాయి తెలుగు, ఆంగ్లం, గణితం రిసోర్స్ పర్సన్స్‌కు ఒక్కరోజు అవగాహనా కార్యక్ర మం నిర్వహించనున్నారు. ప్రాథమిక స్థాయికి ప్రతి మండ లం నుంచి నలుగురు చొప్పున మొత్తం 84 మంది, ఉన్నత పాఠశాల స్థాయి నుంచి ఆరు సబ్జెక్టుల్లో కాంప్లెక్స్ కు ఇద్ద రు చొప్పున 120 మంది జిల్లా శిక్షణకు హాజరుకా నున్నా రు. వీరికి శిక్షణ అందించేందుకు 20 మంది జిల్లా రిసోర్స్ పర్సన్స్ ఎస్‌సీఈఆర్‌టీలో ఈ నెల 22, 23 తేదీలలో శిక్షణ పొంది ఉన్నారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలో పని చేసే తెలుగు, ఆంగ్లం, గణితం, భౌతికశాస్త్రం, జీవశా స్త్రం, సాంఘీకశాస్త్రం, ప్రాథమిక స్థాయిలో తెలుగు, ఆం గ్లం, గణితం, పరిసరాల విజ్ఞాం బోధించే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు అందరు మండల స్థాయి శిక్షణ పొందను న్నారు. ఈ శిక్షణలో ప్రధా నంగా అభ్యాసనా సామర్థ్యాల ఆధారంగా బోధించటం, 2024 నవంబరులో 3, 6, 9 తరగ తిల విద్యార్థులకు జరగ నున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షా విధానంపై అవ గాహన కల్పించనున్నారు. ఈ పరీక్ష విద్యార్థులకు ఓఎం ఆర్ ఆధారంగా జరగనున్నం దున విద్యార్థులకు ఓఎంఆర్ పత్రాలపై సమాధానాలు గుర్తించటంలో అవగాహన కల్పించనున్నారు. సాధారణ సిలబస్ బోధనతో పాటు నేషనల్ అచీవ్‌మెంట్‌సర్వే మాదిరి ప్రశ్నలు తయారు చేసుకొని ఉపాధ్యాయులు విద్యార్థులకు పరీక్షా విధానంపై పూర్తి అవగాహన కలిగే విదంగా కార్యచరణ చేపట్టనున్నారు.

గ్రీవెన్స్ బాధితులకు సత్వర న్యాయం చేయాలి

» అధికారులకు ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదేశం


బాధితుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

కొత్తగూడెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలిన ఎస్పీ రోహిత్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్పీ గ్రీవెన్స్‌లో బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులు విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేకూర్చాలని ఆదేశించారు. మొత్తం ఐదుగురు బాధితులు ఎస్పీని కలిసి తమ సమస్యలను తెలిపారు. ముగ్గురు బాధితులు తమ భూమిని వేరే వ్యక్తులు ఆక్రమించారని తమకు న్యాయం చేయాలని కోరారు. ఒక మహిళ తన భర్త బాగా తాగి వచ్చి ఇంట్లో అందరిపై దాడి చేస్తున్నాడని, పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టిన పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. ఒక వ్యక్తికి ఎక్కువ మొత్తంలో బంగారాన్ని తక్కువ రేటుకి ఇస్తానని మాయమాటలుచెప్పి డబ్బులు తీసుకుని నకిలీ బంగారం ఇచ్చి చీటింగ్ చేశాడని ఫిర్యాదు చేశారు. ఈ ఐదుగురు బాధితుల విషయంలో వెంటనే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేకూర్చాలని సంబంధిత అధికారులకు ఎస్పీ ఆదేశించారు.

వారోత్సవాల మధ్య సంతలకెళ్లిన వ్యాపారులు

దుమ్ముగూడెం, జూలై 29: పీఎల్‌జీఏ వారోత్సవాల మధ్య సోమవారం మండల వ్యాపారులు సరిహద్దు చత్తీస్‌ఘడ్ రాష్ట్రం ధర్మపేటలో జరిగే వారాంతపు సంతకు ఎప్పటిలానే వెళ్లారు. ధర్మపేటకు వెళ్లిన కొందరు వ్యాపారులు ఈనెల 30న జరగనున్న కిష్టారం సంతకు వెళ్లేందుకు బయల్దేరగా, కిష్టారం పోలీసులు వారిని అడ్డుకున్నారు. కాగా కిష్టారం సంతకు వెళ్లేందుకు కొందరు వ్యాపారులు ధర్మపేటలో మకాం వేయగా, మరి కొందరు ఇళ్లకు వెనుదిరిగారు. వీరంతా మంగళవారం ఉదయం కిష్టారం సంతకు వెళ్లాలని చూస్తున్నారు. కాగా సరిహద్దు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని పైడిగూడెం, ధర్మపేట, ఎలకనగూడెం, కిష్టారం, గొల్లపల్లి, గాజులగట్ట, పాలోడి, పొటకపల్లి సీఆర్‌పీఎఫ్ క్యాంపుల్లోని పోలీసు బలగాలు డీఆర్జీ బలగాలతో కలిసి సమీప అటవీప్రాంతంలో విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు.

జక్కంపూడి కుటుంబానికి గరికపాటి పరామర్శ


జక్కంపూడి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ గరికపాటి

తల్లాడ, జూలై 29: తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో మృతిచెందిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు జక్కంపూడి కృష్ణమూర్తి కుటుంబాన్ని సోమవారం మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, తానా పూర్వ అధ్యక్షుడు కోమటి జయరామ్, టీఎన్‌జీవోఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు పరామర్శించారు. జక్కంపూడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణమూర్తి కుమారులు కిషోర్, రాము, సోదరుడు చంద్రశేఖర్‌లను పరామర్శించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కాటమనేని రమేష్ పాల్గొన్నారు.

బ్యాంక్ భవనానికి తాళంవేసిన యజమాని

» స్పష్టమైన హామీ ఇవ్వడంతో తెరుచుకున్న బ్యాంక్



తాళం వేసివున్న బ్యాంక్

సత్తుపల్లిరూరల్, జూలై 29: రెండేళ్ల నుంచి లీజ్ అగ్రిమెంట్ చేయకుండా కాలం వెళ్లదీస్తున్న ఓ బ్యాంక్ భవనానికి సదరు యజమాని తాళం వేసిన సంఘటన సోమవా రం సత్తుపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని హైపర్ ఫ్రెష్ పక్కన కొన్నేళ్లుగా వినియోగదారులకు సేవలందిస్తున్న యూని యన్ బ్యాంక్ (ఆంధ్రాబ్యాంక్) యజమాని చలసాని హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం. 15నెలల క్రితం అగ్రిమెంట్ పూర్తయినా కొత్త అగ్రిమెంట్ రాసేందుకు ముందుకు రావడం లేదని, బ్యాంక్ భవనం తెరవకముందే తాళం వేసినట్లు తెలిపారు. సాయంత్రం బ్యాంక్ ఉన్నతాధికారులు తనతో మాట్లాడి నెల రోజులలో లీజ్ అగ్రిమెంట్‌కు హామీ ఇవ్వడంతో తాళం తీసినట్లు పేర్కొన్నారు. అయితే శని, ఆదివారాలు సెలలు కావడంతో సోమవారం ఖాతాదారులు చాలామంది వచ్చి బ్యాంక్ మూసి ఉండటం చూసి వెనుతిరిగి వెళ్లారు. బ్యాంక్ అధికారులు సైతం తాళం వేసి ఉండటంతో యజమానితో సంప్రదింపులు జరిపినా లాభం లేకపోయింది. ఉన్నతాధికారులు కల్పించుకోవడంతో మధ్యాహ్నం 3.30ల సమయంలో తాళాలు తీయడంతో బ్యాంక్ సేవలు కొనసాగడంతో అటు ఖాతాదారులు, ఇటు బ్యాంక్ ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. ఇదే విషయమై బ్యాంక్ మేనేజర్ రామారావును వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి బ్రాంచ్‌కు వెళ్లగా సమాధానం చెప్పలేదు.

జ్వరంతో వ్యక్తి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

తిరుమలాయపాలెం, జూలై 29: మండలంలోని పాతర్లపాడుకు చెందిన జ్వరంతో మృతిచెందిన సంఘట న సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన జడల శ్రీనివాస్ (52) ఎరువులు, పురుగులమదు వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. అతనికి నాలుగురోజుల క్రితం జ్వరంతో బాధపడతున్నాడు. ఈనేపథ్యంలో మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాస్ మృతితో గ్రామంలో విసాదచాయలు అలుముకున్నాయి. శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పాల్గొనేవాడు. కాగా ఆయన పార్థీవదేహాన్ని జిల్లా కాంగ్రెస్ నాయకులు చావా శివరామకృష్ణ, జడల నగేష్, .జడల రమేష్ సందర్శించి నివాళులర్పించారు.

గుండెపోటుతో హెచ్‌ఎం వెంకటేశ్వరావు మృతి

● సంతాపం తెలిపిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు


వెంకటేశ్వరావు (ఫైల్)

బోనకల్, జూలై 29: మండలంలోని ఆళ్లపాడు ప్రాథమిక పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పని చేస్తున్న మానుకొండ వెంకటేశ్వరావు(57) గుండెపోటుతో సోమవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయన స్వస్థలం కల్లూరు మండలం లింగాల గ్రామం. చింతకాని మండలంలో లచ్చగూడెంలో పని చేసిన వెంకటేశ్వరావుకు గత నెల 24న ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పదోన్నతి రావడంతో ఆళ్లపాడు పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని యూటీఎఫ్, పీఆర్టీయు నాయకులు పారుపల్లి నాగేశ్వరావు, నాగమల్లేశ్వరావు, వల్లంకొండ రాంబాబు, గుగులోతు రామకృష్ణ, కొనకంచి రామ్మోహన్, చింతల రవి కుమార్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి..

సత్తుపల్లిరూరల్, జూలై 29: పేకాటాడుతున్న స్థావరంపై సత్తుపల్లి పోలీసులు సోమవారం దాడిచేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని బాసారం శివారులో దాడిచేయగా ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1900నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కల్లూరు, జూలై 29: మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులు తాళలేక సోమవారం ఆత్మహత్యకు చేసుకున్నాడు. ఈ సంఘనకు సంబంధించి పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన గుగులోతు కృష్ణ (32), భార్య మౌనిక అనారోగ్యంతో హైదరాబాద్ వైద్య చికిత్స పొంది ఇటీవల ఇంటికి చేరుకున్నది. ఆ క్రమంలో కృష్ణ తన భార్యకు వైద్య ఖర్చుల నిమిత్తం అప్పులు చేశాడు. మరో వైపున మద్యానికి బానిసైన కృష్ణ తన భార్యతో తరుచుగా వివాదానికి దిగటంతో పుట్టింటికి వెళ్లిపోయింది, దీంతో ఆదివారం తన ఇంట్లో ఉన్న మేకను అమ్మి ఆ డబ్బులతో మద్యం సేవించి రాత్రి ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం తన ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంట్లో ఉరివేసుకుని కృష్ణ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా మృతుడి తండ్రి రాము ఫిర్యాదుతో కల్లూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శతాధిక వృద్ధురాలి కన్నుమూత

పెనుబల్లి, జూలై 29: పెనుబల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు సీపీ.కౌసల్య(110) సోమవారం మృతిచెందారు. కౌసల్య మూడురోజుల వరకు తన పనులు చేసుకుంది. తనకు పిల్లలు లేకపోవడంతో ఒక అమ్మాయిని దత్తత తీసుకొని చాదుకుంటుంది. అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది.

మెడికల్ షాపు ముందు గుర్తుతెలియని వృద్ధురాలు



ఖమ్మంక్రైం, జూలై 29: ఖమ్మం నగరంలోని గట్టయ్య సెంటర్‌లో ఉన్న ఓ మెడికల్‌షాపు వద్ద గుర్తుతె లియని వృద్ధురాలిని గుర్తుతెలిని వారు వదిలివెళ్లిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. సుమారు 80 ఏళ్ల వృద్ధురాలిని మెడికల్‌షాపు ఎదుట వదిలివెళ్లడంతో మెడికల్‌షాపు యాజమాన్యం వివరాలు అడిగే ప్రయ త్నం చేసినప్పటికి చెప్పలేకపోతుంది. ఆమెను తన కుమారుడు ఇక్కడ వదిలేసి వెల్లాడని తనే వచ్చి తీసుకెళతాడని ఎక్కడికి వెళ్లనంటూ సమాధానం చెబుతుంది. దీంతో ఆమె ఫోటో సోషల్‌మీడియాలో ఆమె ఫోటో వైరల్ అవుతుంది. కాగా సోమవారం రాత్రి వృద్ధురాలి మనువడు వచ్చి తీసుకెళ్లినట్టు తెలిసింది.

తాళం వేసిన ఇంట్లో చోరీకి యత్నం

కారేపల్లి, జూలై 29: మండల పరిధిలోని పాత కమలాపురం గ్రామంలో తాళం వేసిఉన్న ఇంట్లో దొంగలు చోరీకి యత్నంచారు. ఎంతకు బీరువ తాళం రాకపోవడంతో చోరీకి వచ్చిన దొంగ పారిపోయిన సంఘటన అదివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పూసులూరి మాణీకమ్మ ఆరోగ్యం బాగలేకపోవడం తో ఇంటికితాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. అయితే గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లో చోరీ ప్రయత్నం చేశాడు. బీరువ తాళం పగలకొట్టేందు విశ్వప్రయత్నం చేశాడు. ఎంతకు తాళం రాకపోవంతో తిరిగి వెళ్లాడు. ఇదంతా సీసీ టీవీలో చూసిన గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ రాజారామ్ వచ్చి పరిశీలించి కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అదుపుతప్పి కారు పల్టీ

ముదిగొండ, జూలై 29: అదుపుతప్పి కారు పల్టీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి స్వల్పగాయాలైన సంఘటన ముదిగొండ మండలం వల్లాపురం వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం... ముది గొండ మండలం వల్లాపురం గ్రామానికి చెందిన చిర్రా ప్రవీణ్, చిర్రా తిరపయ్య మధిర నుంచి మల్లన్న పాలెం వైపు కారులో వెళ్తుండగా వల్లాపురం మూలమ లుపు వద్ద అదుపుతప్పి కారు పల్టీకొట్టింది. స్థానికులు గమనిం చి కారులో ఉన్న ప్రవీణ్, తిరపయ్యను బయటకు తీశారు. ప్రవీణ్, తిరపయ్యకు స్వల్పగాయాలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

అశ్వారావుపేట రూరల్, జూలై 29: రోడ్డు ప్రమాదం లో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరా ల ప్రకారం ఆంధ్రాలోని బుట్టాయిగూడెం మండలం రే గులకుంట గ్రామానికి చెందిన తెల్లం మజ్ను(25) వేలే రుపాడులోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై బ యలుదేరాడు. మండలంలోని వినాయకపురం సమీపం లో రోడ్డుపై పడుకున్న గేదెలు కనిపించకపోవటంతో వాటిని ఢీకొట్టాడు. ప్రమాదంలో మజ్నుకు తీవ్రంగా గా యాలు అయ్యాయి. క్షతగాత్రుడిని అశ్వారావుపేటలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెం దాడు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు. విషయం తె లుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం ని మిత్తం తరలించి వివరాలు సేకరిస్తున్నారు.

బిక్షాటన చేస్తూ గుర్తు తెలియని యాచకుడి మృతి

భద్రాచలం, జూలై 29: భద్రాచలం రామాలయం సమీపంలో బిక్షాటన చేస్తున్న గుర్తు తెలియని యాచ కుడు సోమవారం మృతి చెందాడు. కాషాయ రంగు దుస్తులు ధరించి ఉన్న వృద్ధుని వయస్సు 70 సంవత్స రాలు ఉంటుంది. ఇతని పేరు అప్పన్న అని మల్లూరు గుట్ట వద్ద నుంచి ఇక్కడకు వచ్చి నివాసం ఉంటున్నారని స్థానికులు పేర్కొంటున్నట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712682160 భద్రాచలం పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పోయిన మొబైల్ ఫోన్ అందజేత

నేలకొండపల్లి, జూలై 29: తన మొబైల్ పోయిందని వారం క్రితం మండల పరిధిలోని రాజేశ్వరపురం గ్రామా నికి చెందిన ఆలకుంట బుజ్జిబాబు నేలకొండపల్లి పోలీ సులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన నేలకొండ పల్లి పోలీసులు రాజేష్, నాగరాజులు సీర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ కోడె త్రాసు ద్వారా బుజ్జిబాబుకు అందచేశారు.

మానవ అక్రమ రవాణను నిర్మూలిద్దాం

ఖమ్మంక్రైం, జూలై 29: మానవ అక్రమరవాణ హేయ మైన చర్య అని దానిని అందరం కలిసి కట్టుగా నిర్మూ లించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏడీసీపీ నరేష్‌కు మార్ అన్నారు నేడు మానవ అక్రమరవాణ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యాక్షన్‌ఫర్ ఇంటిగ్రేటె డ్ డెవలప్‌మెంట్ సంస్థ, యాంటీహ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమరవాణ వ్రతి ఏడాదిజూలై30న అవగాహన పెంచడానికి బాదితుల హక్కులను ప్రోత్సహించడానికి , రక్షించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగడతాయన్నారు. అత్యవసర సమయాల్లో డయల్100, 1098 , 112, 8712656858 నెంబర్లకు ఫోన్‌చేసి ఎవరైనా తక్షణ సాయం పొందవచ్చన్నారు. ఈకార్యక్రమంలో పోలీసు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌చార్జి బాలాజీ, యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటేడ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ హరిప్రసాదరావు, కో ఆర్డినేటర్లు శ్రీనివాస్, రాజేష్ పాల్గొన్నారు.

పగిడేరులో విషాదం

» వృద్ధ దంపతుల ఆత్మహత్య
ఆస్తి వివాదాలు, కుమార్తె మరణమే కారణమంటున్న స్థానికులు?
» కూమారుడి ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు


రోదిస్తున్న కుటుంబసభ్యులు


రామచంద్రయ్య (ఫైల్)


సరోజని (ఫైల్)

మణుగూరు, జూలై 29: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని పగిడేరు గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్న వృద్ధ దంపతుల ఆత్మహత్య సంచలనం సృష్టించింది. ఇందుకు సంబంధించి అసలు విషయాలు సోమ వారం వెలుగులోకి వచ్చాయి. పగిడేరు పంచాయతీలో ఎస్టీ కాలనీలో నివాస ముండే కాసరబాధ రామచంద్రయ్య అలియాస్ చంద్రయ్య(80), భార్య సరోజని(75) తమ ముగ్గురు కుమారులు వెంకటేశ్వర్లు, పూర్ణ చందర్‌రావు, రమేష్‌కువారి భూమిని మూడు వాటాల కింద పంచారు. ముగ్గురికి తలా 12 ఎకరాల భూమిఉంది. కుమారుల పెళ్లిళ్లు చేసిన తర్వాత దంపతులు ఇద్దరు ఎవరి వద్ద ఉండకుండా ఎస్టీ కాలనీ మరో ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసుకుని అక్కడ చిరు దుకాణాన్ని నడుపుకుంటూ తమ వద్ద ఉంచుకున్న ఆరు ఎకరాల భూమిలో వ్యవసా యాన్ని చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే చిన్న కుమారుడు రమేష్‌కు భార్య ఇద్దరు ఆడపిల్లలు సంతానం కాగా.. పిల్లలు పెద్దయ్యారు. కరోనాతో రమేష్ భార్య కన్నుమూసింది. అయితే రమేష్ మరో వివాహం చేసుకున్నాడు. రమేష్ మొదటి భార్యఇద్దరి పిల్లల భవిష్యత్ కోసం తాత అయిన చంద్రయ్య మణు గూరు పట్టణంలోని తనకున్న ఓ ఇంటిని చిన్న కుమారు డికి ఇచ్చాడు. దీంతో చిన్న కుమారుడు ఇచ్చిన ఇంటిని అమ్మి ఆ పిల్లల పెళ్లిళ్లు చేశాడు. ఈవిషయంలో కుటుంబ కలహాలు జరుగుతుండేవని తెలిసింది. అంతే కాకుండా సరోజనకు షుగర్ పెరిగి నడవలేని ప రిస్థితులు నెలకొనగా నెలరోజుకో కుమారుడి వద్ద ఉంటూ జీవిస్తోంది. తండ్రి మాత్రం తాను ఎస్టీ కాలనీలో నివాస ముండసాగాడు. కాగా తన భార్య ఆరోగ్యం బాగోలేకపోవ డంతో ఈమెకు సంబంధించిన మాత్రలను శనివారం మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి తీసుకుని వెళ్లాడు. తన మనవళ్లను అందరినీ పిలిపించుకుని మాట్లాడారు. ఆ తర్వాత అంతా వెళ్లిన పోయిన తర్వాత ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో భార్యను ఇంటిసమీపంలోని భావిలో తోసి తాను కూడా భావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు వార్తలు వినవచ్చాయి. అ యితే ఆదివారం సాయంత్రమే సరోజన మృతదేహం బావిలో తేలుతూ కనిపించ డంతో ఇరువురు దంపతులు బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంటారని భావించి స్థానికులు బావిలో గాలింపు చర్యలను చేప ట్టారు. రాత్రి 11 గంటల వరకు చంద్రయ్య కోసం గాలింపు చర్యలు జరిగాయి. పోలీ సులు కూడా ఆదివారం సాయంత్రం నుంచి స్థానికులతో కలసి గాలింపు చర్య ల్లో పాల్గొన్నారు. అయినా చంద్రయ్య మృత దేహం లభ్యం కాలేదు. కాగా ఆదివారం మరో సంచలం కలిగించే విషయాలు తెలిశాయి. చంద్రయ్య మృతదేహం బావి నుంచి మరి కొంత దూరంలో పొలాల్లో ఉన్న ఓ మామిడి చెట్టుకు వేలాడుతున్నట్లు స్థానికులు గమనించారు. మామిడి చెట్టుకు చంద్రయ్య గుడ్డముక్క లతో పేనిన తాడుతో ఉరి వేసుకుని మృతి చెందాడు. దీంతో వీరి మరణాలు మిస్టరీ గా మారాయి. వృద్ధ దంపతులు ఎలా మృతిచెందారు అన్న విషయాలపై పలు అనుమా నాలు వ్యక్తం అవుతున్నాయి. కుటుంబ సభ్యులతో ఆస్తి వివరాల విషయంలో జరిగిన వివాదాలు... దంపతులను తీవ్ర మనస్తాపానికి గురి చేశా యా.... దీంతో సరోజిని బావిలో దూకగా చంద్రయ్య ఉరి వేసుకున్నాడా.. లేదా కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న ఆస్తి వివాదాల్లో ఇరువురి మధ్య సమన్వయం లోపించ డంతో ముక్కుసూటి మొండి వైఖరి ప్రవర్తన గల చంద్రయ్య భార్యను హతమార్చి తానుకూడా ఉరి వేసుకు ని ప్రాణం తీసుకున్నాడా.. అనే అనుమానాలు ఉన్నాయి. ఎందుకంటే సరోజని ఆదివారం సాయంత్రం బావిలో తేల డం ఈ వాదనకు కొంత బలాన్ని చేకూర్చినట్లుగా ఉంది. ఇది ఇలా ఉంటే చంద్రయ్య, సరోజనిలకు ముగ్గురు కొడు కులతో పాటు ఓ కుమార్తె కూడా ఉంది. అమెకు వివాహం చేయగా సూర్యపేటలో నివాసముండేది. మూడేళ్ల క్రితం కరోనాతో ఆమె మృతి చెందింది. దీంతో దంపతులు ఇద్దరూ కూతురు ఇక లేదన్న మనోవేధనతో ఆనారోగ్య పీడి తులయ్యారు.

ఈ విషయంలో ఇంతకు ముందు తన కూతురే లేదు... ఎందుకు ఈ బతుకు అంటూ గ్రామంలో పలు సందర్భాల్లో పలువురి ముందు చంద్రయ్య పేర్కొంటూ వచ్చినాపర్వాలే దని తెలిపినట్లు సమాచారం. అంతే కాకుండా రెండు సార్లు ఆత్మహత్య ప్రయత్నానికి పాల్పడినట్లు కూడా పలువురు బంధువులు పేర్కొన్నారు.

చంద్రయ్య మృతదేహం లభించడంతో ఇద్దరి మృతదేహా లను మణుగూరు 100పడకల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. ఆనారోగ్యాల కారణంగానే తమ తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొంటూ చంద్రయ్య పెద్ద కుమారుడు వెంకటేశ్వర్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చే శాడు. మణుగూరు ఎస్ఐ మేడ ప్రసాద్ కేసు నమోదు చే సుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను పగిడేరు తరలించారు. బంధువుల కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. పగిడేరులో విషాధ చాయలు అలుముకున్నాయి.

వృద్ధులకు, అనాథలకు దుస్తుల పంపిణీ



మధిర, జూలై 29: ఏపీలోని గంపలగూడేనికి చెందిన కుందా కోటేశ్వరరావు సోమవారం మధిరలో ఆదర్శ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో, మరనాత ఆర్‌కే ఫైండేషన్ రెస్క్యూ హోంలో, మథర్ తెరిస్సా సేవాసదనంలోని మానసిక వికలాంగ విద్యార్థులకు అవసరమైన దుస్తులు పంపిణీ చేశారు. మహాత్మగాంధీ ఉచిత దుస్తుల పంపిణీ కేంద్రం సందర్శించి పేదలకు అవసరమైన దుస్తులను అందజేశారు. షేర్ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న కార్యకళాపాలు అవసరమైన సిమెంట్ బల్లలు అందజేస్తామని తెలిపారు. ఈకార్యక్రమాల్లో పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, ఇరుకుళ్ల లక్ష్మీ నర్సింహారావు, మాదవరపు నాగేశ్వరరావు, డాక్టర్ మల్లీకార్జునరావు, బాబ్లా, దొడ్డా శ్రీనివాసరావు, తాళ్లూరి బాలరాజు, లంకా కొండయ్య పాల్గొన్నారు.

ఆస్తిపన్నులు సవరణ

- అండర్ అసెస్‌మెంట్‌కోసం 14 ప్రత్యేకబృందాలు
- రూ.2కోట్ల మేర ఆదాయం పెంపునకు ప్రణాళిక

ఖమ్మంకార్పొరేషన్, జూలై29: ఖమ్మం నగర పాలక సంస్థకు ముఖ్యమైన ఆదాయవనరు ఆస్తిపన్నులు... వాటిని సవరించకపోవటంతో ఆదాయం పెరగటం లేదు. దీంతో ఆస్తిపన్నుల సవరణకోసం (అండర్ అసెస్‌మెంట్) 14 ప్రత్యేక బృందాలను నగరపాలకసంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య నియమించారు. వారికి రెవెన్యూ డివిజన్‌ల వారీగా నివాసాలను కేటాయించారు. ప్రతీరోజు సదరు నివాసాల అండర్ అసెస్‌మెంట్‌పై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దాంతో ప్రత్యేక బృందాల్లోని బిల్‌కలెక్టర్లు నగరంలో పర్యటిస్తూ ఇంటిపన్నులను పర్యవేక్షిస్తున్నారు.



ఒక్కో బృందంలో ఇద్దరి వంతున...

ఆస్తిపన్నుల సవరణకు 14ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా, ఒక్కో బృందంలో ఇద్దరి వంతను బిల్ కలెక్టర్లను నియమించారు. రెవెన్యూ డివిజన్ విస్తీర్ణాన్నిబట్టి ఒకటి నుంచి రెండువరకు రెవెన్యూ డివిజన్‌లను కేటాయించారు. ఈ బృందాలు ప్రతిరోజు కమిషనర్‌కు నివేదిక ఇవ్వటంతో పాటు నిర్ణీత సమయంలో ఆస్తిపన్నుల సవరణలు చేయాల్సి ఉంటుంది. 1,2 రెవెన్యూ డివిజన్లు కేటాయించిన బృందం 5519ఇళ్లను పరిశీలించాలి. 5,6డివిజన్లు కేటాయించిన బృందం 9548 ఇళ్లను పరిశీలించాల్సి ఉంది. ఇలా రెవెన్యూ డివిజన్ల వారీగా ఇళ్లను కేటాయించారు. కాగా 14,15 రెవెన్యూ డివిజన్లలో 8432 ఇళ్లు ఉన్నాయి.11వ రెవెన్యూ డివిజన్‌లో 7357 ఇళ్లు ఉన్నాయి.

9,10 రెవెన్యూ డివిజన్లలో 5346 ఇళ్లు ఉన్నాయి.

ప్రత్యేక బృందాలు రెవెన్యూ డివిజన్లలో పర్యటిస్తూ ఇంటిపన్నులను పర్యవేక్షిస్తుంటారు.ఇంటినెంబర్లు లేకుండా ఆస్తిపన్నులు ఖరారు చేయనివారికి వెంటనే ఇంటినెంబర్లు కేటాయించి, ఆస్తిపన్నులు వేస్తారు. అలాగేపై అంతస్తు నిర్మించి కూడా పాతఆస్తిపన్ను వస్తుంటే వెంటనే సవరణ చేసి, ఆస్తిపన్నును ఖరారు చేస్తారు. బల్లేపల్లి సమీపంలో ఒక ఇంటికి అనేక ఏళ్లుగా కేవలం రూ.150 మాత్రమే ఆస్తిపన్ను వస్తున్నది. దీంతో ఇంటిని పరిశీలించి, కొలతల ఆధారంగా ఆస్తిపన్నును సవరిస్తే రూ.2వేల వరకు వచ్చింది. నగరంలోని ఒక వాణిజ్య ప్రాంతంలో ఒక నిర్మాణానికి ఏడాదికి రూ.6వేలు ఆస్తిపన్ను వస్తున్నది. దానిని సవరిస్తే రూ.10వేలకు పైగా ఆస్తిపన్ను చెల్లించాలని తేలింది.

అండర్ అసెస్‌మెంట్లు లేకపోవటంతో...

అండర్ అసెస్‌మెంట్లు లేకపోవటంతో ఈ పరిస్థితి నెలకొంది. వాస్తవంగా ప్రతీ ఆరునెలలకు ఒకసారి నగరంలోని నివాసాలను పరిశీలించి, అదనపు నిర్మాణాలు చేపడితే ఎక్కువ ఆస్తిపన్నును వేయాలి. దీనినే అండర్ అసెస్‌మెంట్ అంటారు. ఇలా నివాసాలను పరిశీలించకపోవటంతో నగరపాలకసంస్థ ఆస్తిపన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని భారీగా కోల్పోతున్నది. పరిస్థితిని గమనించిన కమిషనర్ అండర్ అసెస్‌మెంట్‌కు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

రూ.2కోట్లు అదనపు ఆదాయానికి ప్రణాళిక

అండర్ అసెస్‌మెంట్లు లేకపోవటం, కొన్ని ప్రాంతాల్లో నివాసాలకు ఆస్తిపన్ను ఖరారు చేయకపోవటం వంటి కారణాలతో ఆదాయం సరిగా రాకపోవటంతో ఈ ఏడాది ఆస్తిపన్నులతో రూ.2కోట్లు అదనపు ఆదాయం గడించేందుకు కృషి చేస్తున్నారు. కమిషనర్ ప్రత్యేక చొరవతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయటంతో ఆస్తిపన్నుల ద్వారా భారీ ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

విద్యుత్ అధికారుల పొలంబాట





రాఘవాపురం పొలాల్లో విద్యుత్ ఎస్‌సీ సురేందర్, జీడీబీపల్లిలో పొలంబాటలో విద్యుత్‌శాఖ అధికారులు, రైతులు

చింతకాని,జూలై29: విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు విద్యుత్ అధికారుల పొలంబాటలో భాగంగా సోమవారం మండల పరిధిలోని రాఘవా పురంలో వ్యవసాయ క్షేత్రాల్లో ఎస్ఈ సురేందర్ సిబ్బందితో పర్యటించారు. 11కేవీతో పాటు ఎల్‌టీ విద్యుత్‌లైన్లను పరిశీలించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాడుతున్న తీగలను పరిశీలించి మరమ్మతులు నిర్వ హించారు. కార్యక్రమంలో డీఈ తిలక్, ఏఈ వెంకన్న, లైన్‌మెన్‌లు కిషన్, విజయ్,పెంట్యాల అప్పారావు, అబ్బూరి మహేష్, కొల్లి గోవిందరావు, దొబ్బల నరసింహరావు పాల్గొన్నారు.

కల్లూరు: మండల పరిధిలోని గోపాలదేవ బోయినపల్లి గ్రామంలో సోమవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. సత్తుపల్లి విద్యుత్‌శాఖ డివిజనల్ ఇంజనీర్ ఎల్ రాములు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఎం యాదగిరి, అసిస్టెంట్ ఇంజనీర్ వి గణేష్ విద్యుత్ వినియోగంపై రైతులకు అవగహన కల్పించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ లైన్ ఇన్స్‌పెక్టర్ ఎం.ఉస్మాన్‌బేగ్, శీలం సత్యనారాయణరెడ్డి, నర్సిరెడ్డి, అజ్మీరా రామకృష్ణ పాల్గొన్నారు.

తల్లాడ: మండల పరిధిలోని కుర్నవల్లిలో సత్తుపల్లి డీఈ ఎల్.రాములునాయక్ విద్యుత్‌శాఖ-పొలంబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేయడం, విరిగిన, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను మార్చటం, కిందకు వేలాడుతున్న లైన్లను సరిచేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీఈ షేక్. ఖాదర్ బాబా, ఏఈ సుందర్ కుమార్, రాందాస్, లైన్‌ఇన్‌స్పెక్టర్ వై.తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

ఆసుపత్రి తరలించొద్దంటూ ధర్నా



తిరుమలాయపాలెంలో ధర్నా చేస్తున్న విపక్షపార్టీలు

తిరుమలాయపాలెం, జూలై29: తిరుమలాయపాలెంలోని వందపడకల ఆసుపత్రిని తరలించవద్దంటూ విపక్షం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా, ప్రదర్శన నిర్వహించారు. ఆసుపత్రి నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శ నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లానాయకులు కొండబాల కరుణాకర్, సీపీఎం నాయకులు కొమ్ము శ్రీను, ఎంఆర్‌పీఎస్ జిల్లానాయకులు నాగభూషణం మాట్లాడుతూ తిరుమలాయపాలెంలో గత ప్రభుత్వ హయాంలో వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేశారని, దీంతో మండలంలోని 40గ్రామ పంచాయతీల ప్రజలకు వైద్యసేవలందుతున్నాయన్నారు. గ్రామంలో ఏర్పాటుచేసిన ఆసుపత్రిని ఇక్కడే కొనసాగించాలని తెలిపారు. మరో ప్రాంతానికి తరలిస్తే పార్టీలకు అతీతంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఆసుపత్రి తరలింపుపై రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ తీసుకుని అక్కడే ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, మండలనాయకులు కొప్పుల వెంకటరావు, మల్లీడి భాగ్యమ్మ, నామాప్రసాద్, ఎం.రాజేంద్ర ప్రసాద్, జి.రమేష్, మట్టె దుర్గాప్రసాద్, కాంపాటి బాబురవు, పి.సుధాకర్, కె.పుల్లయ్య, కె.స్వామి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల స్థితిగతులపై సర్వే చేయాలి

ఇన్‌చార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సన్యాసయ్య

ఖమ్మంకలెక్టరేట్, జూలై29: ప్రజల స్థితిగతులపై సర్వే నిర్వహించి, వారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఆర్డీవో సన్యాసయ్య పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భారత ప్రభుత్వ సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీసెస్ అసిస్టెంట్ సెక్షన్ అధికారులకు ఫౌండేషన్ శిక్షణ కార్యక్రమంపై అదనపు కలెక్టర్ అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపాధి హామీ పనులు, మహిళా స్వయం సహాయక సంఘాల, రైతు సహకార సంఘాల, దారిద్ర్య రేఖకు దిగువ నున్న కుటుంబాల కార్యకలాపాలపై క్షేత్రస్థాయిలో స్థితిగతులపై షెడ్యూల్ రూపొందించామన్నారు. అసిస్టెంట్ సెక్షన్ అధికారులు ఐదుగురు చొప్పున ఐదు బృందాలుగా చేశామన్నారు. గ్రామాలను ఎంపిక చేసి, అధ్యయన ప్రయోజనం కోసం బృందాలను గ్రామాలకు పంపుతామన్నారు. గ్రామాల క్షేత్ర అధ్యయనాన్ని సద్వినియోగం చేసుకొని, ప్రజల స్థితిగతులను మెరుగుపరిచే చర్యలు అధికారులు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అన్నారు.ఈ సమావేశంలో జడ్పీసీఈవో ఎస్. వినోద్, ఎంసీహెచ్‌ఆర్డీ జిల్లా ట్రైనింగ్ నోడల్ అధికారి ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సన్యాసయ్య

నూతన ఏఎంసీ చైర్మన్లకు మంత్రుల అభినందన



అభినందిస్తున్న మంత్రి తుమ్మల

కల్లూరు, జూలై 29: నూతనంగా ఎంపికైన కల్లూరు, సత్తుపల్లి ఏఎంసీ పాలకవర్గ చైర్మన్, వైస్‌చైర్మన్లకు వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం హైదరాబాద్‌లో అభినందించారు. కల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాగం నీరజదేవి, సతుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంతబాబులతో పాటుగా పాలవకర్గం తరుపున వైస్‌చైర్మన్లు రాజా బోయిన కోటేశ్వరరావు, గొర్ల వెంకటప్పరెడ్డి డైరెక్టర్లులు మంత్రులను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రులు తుమ్మల, పొంగులేటిలు వారిని శాలువలతో సత్కరించారు. ఆయా మార్కెట్ కమిటీల పరిధిలో గల రైతులకు సేవలందించి నూతన పాలకవర్గాలు ఆదర్శంగా నిలువాలని మంత్రులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాగం ప్రభాకరచౌదరి. పుల్లారావు పాల్గొన్నారు.

గొల్ల, కురుమ, యాదవులకు డీడీ డబ్బులు జమ

- ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, జులై29: గత ప్రభుత్వంలో గొర్రెల యూనిట్ల కోసం డీడీ కట్టి రుణాల యూనిట్ల కోసం ఎదురుచూసినా సుమారు 800మంది గొల్ల, కురుమ, యాదవులకు డీడీల సొమ్ము కాంగ్రెస్ ప్రభుత్వం జమచేసినట్లు ఎమ్మెల్యే మట్టా రాగమయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఐదుమండలా నుంచి 2763మంది గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించారు. సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వం స్పందించి డీడీల సొమ్ము తిరిగి వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. నియోజకవర్గంలోని గొల్ల, కురుమ, యాదవులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్



రఘునాథపాలెం, జూలై29: విద్యార్థులకు మెరుగైన వసతి, విద్యా ఇతర సౌకర్యాలను కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆదేశించారు. సోమవారం రఘునాథపాలెం కస్తూర్బా గాంధీ బాలికల వసతిగృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. మరుగుదొడ్లు, వంటశాల, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. తరగతుల నిర్వాహణ, పాఠ్యపుస్తకాలు అందుబాటు, యూనిఫామ్ అందించా అంటూ విద్యార్థులతో నేరుగా మాట్లాడి తెలుసుకున్నారు.

శతచండీయాగం



ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై29: నగరంలోని భవ్యశ్రీ వృద్ధాశ్రమం, జ్యోతిష్యాలయం ఆధ్వర్యంలో మూడురోజులుగా శత చండీయాగ సహిత రుద్రయాగాన్ని నిర్వహిస్తున్నారు. 40మంది బ్రాహ్మణులు నిర్వహిస్తున్న ఈ యాగంలో భాగంగా పూర్ణాహుతి, అన్నవితరణ ఈనెల 31న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సునీత తెలిపారు. యాగంలో కటకం గిరిప్రసాద్, చిన్ని, సునీత, దండ్యాల లక్ష్మణరావు శ్రావణి, వాణి, లక్ష్మి, ఉష పాల్గొన్నారు.

ఇన్ఫినిక్స్‌కు ఎస్‌బీఐటీ విద్యార్థుల ఎంపిక

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై29: సాఫ్ట్‌వేర్ కంపెనీ ఇన్ఫినిక్స్‌కు నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. బీటెక్ నాలుగో ఏడాది చదువుతున్న మనీషాయాదవ్, రమ్యశ్రీ రూ.4.5లక్షలు వేతనం అందుకుంటారని తెలిపారు.

గోదాములను పరిశీలించిన రాయల

ఖమ్మంరూరల్,జూలై29: మండల పరిధిలో పెద్దతండా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్, రఘునాథ పాలెం మండలంలోని జింకలగూడెం గ్రామాల్లోని గోదాములను రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గోదాములు పరిసరాలను పరిశీలించి, స్టాక్ రిజిస్టార్లను తనిఖీ చేశారు. గోదాముల సామర్థ్యం, పనిచేస్తున్న హమాలీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల గురించి ఆరా తీశారు. ఏమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో గోదాముల ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు, ఆర్‌ఎం పద్మావతి, మేనేజర్ సుందర్‌లాల్, కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్క శేఖర్‌గౌడ్, స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దతండాలో గోదాములను పరిశీలిస్తున్న రాయల

ఉద్యమాల ద్వారానే హక్కుల సాధన

- ఇఫ్టూ జిల్లా కార్యదర్శి రామయ్య

నేలకొండపల్లి, జూలై29: ఉద్యమాల ద్వారానే కార్మిక వర్గం తమ హక్కులను సాధించుకోగలుగుతుందని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి రామయ్య అన్నారు. నేలకొండపల్లి మార్కెట్‌యార్డులో సోమవారం జరిగిన ఇఫ్టూ అనుబంధ తెలంగాణా ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం నాలుగవ మహాసభ సాలయ్య అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ ఎన్నో త్యాగాల ఫలితంగా కార్మిక వర్గం సాధించుకున్న హక్కులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాలరాయటానికి ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. తొలుత మహాసభల పతాకాన్ని మండల అధ్యక్షుడు యాకూబ్ ఆవిష్కరించారు. ఇఫ్టూ డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య, పగిడికత్తుల రామదాసు మాట్లాడారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్.యాకూబ్, ఉపాధ్యక్షుడిగా దాసరి వంశీ, ప్రధాన కార్యదర్శిగా పేరుమల్ల పిచ్చయ్య, కోశాధికారిగా శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిగా సట్టు శ్రీనులతో పాటు మరోఐదుగురు సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. మహాసభలో గోసు పుల్లయ్య, వెంకన్న, లెనిన్, జనార్ధన్‌సింగ్, చిర్రా భిక్షం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉద్యోగులకు సన్మానం

కొణిజర్ల, జూలై29: మండలంలో బదిలీ అయిన ఉద్యోగులను సోమవారం సన్మానించారు. తహసీల్దార్ కార్యా లయంలో బదిలీ అయిన తహసీల్దార్ రాంబాబు, డీటీ ఎర్రయ్య, ఏఎస్‌వో కమలకుమారి, అటెండర్ రాధమ్మను సహోద్యోగులు సన్మానించారు.తాసీల్దార్ రాంబాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు తననకు సహకరించిన ఉద్యోగులకు, రాజకీయ నాయ కులకు కృతజ్ఞతలు తెలిపారు. డీటీ ఎర్రయ్య మహ బూబాద్ జిల్లాకు, ఏఎస్‌వో కమలకుమారి ఖమ్మం రూరల్‌కు, జూనియర్ అసిస్టెంట్ విజయ్ ఖమ్మం అర్బన్‌కు బదిలీ అయ్యారు.

జర్నలిస్టుల సంక్షేమ నిధికి రూ.25లక్షల కేటాయింపు

- రాజకీయాలకతీతంగా జర్నలిస్టులు పనిచేయాలి
- సత్తుపల్లి ప్రెస్‌క్లబ్ ఆత్మీయ సమ్మేళనం

సత్తుపల్లిరూరల్, జూలై29: సత్తుపల్లి డివిజన్ జర్నలిస్టుల సంక్షేమ నిధికి రూ.25లక్షల నిధులు కేటాయిస్తునట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ విజయకుమార్ పేర్కొన్నారు. ఈ నిధులను డిపాజిట్ చేసి వచ్చే వడ్డీతో విలేకరుల సంక్షేమానికి ఖర్చు చేస్తామన్నారు. సోమవారం స్థానిక జేకేన్వెన్షన్ హాల్‌లో సత్తుపల్లి ప్రెస్‌క్లబ్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులకు సత్తుపల్లి కేంద్రంగా ఉచిత హెల్త్‌కార్డులను అందిస్తామన్నారు. ప్రైవేటు ఆసుపత్రులతో మాట్లాడతానని దయానంద్ హామీ ఇచ్చారు. ఖమ్మంలోని కిమ్స్ ఆసుపత్రిలో సైతం అతితక్కువ ఖర్చుతో వైద్యం అందించేలా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో ఇంతక ముందే మాట్లాడినట్లు చెప్పారు. సత్తుపల్లి ప్రాంతంలో ఇళ్లస్థలాలను గుర్తించి ఇచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ డీఆర్‌డీవో నల్లబోతుల రవి మాట్లాడుతూ సాహిత్యంతో పాటు వాస్తవాలను రాసిన తర్వాత పత్రికలో వచ్చిన కథనాలను చూసిన తర్వాత వచ్చే ఆనందం అంతా ఇంతా కాదన్నారు. సమాజంలో అన్నివర్గాల కోసం పనిచేస్తూ రాజకీయాలకు అతీతంగా జర్నలిజం పని చేయాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరారు. సమాజంలో ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలను పరిష్కరించే దిశగా జర్నలిస్టులు అడుగులు వేయాలన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రచారం చేస్తూ ప్రజా సమస్యలను వెలికి తీసి వాటి పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు.





అధ్యక్షకార్యదర్శులను సన్మానిస్తున్న దయానంద్, మాట్లాడుతున్న సండ్ర

నూతన అధ్యక్ష,కార్యదర్శులకు సన్మానం

సత్తుపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాదిరాజు సుధాకర్, నర్రా అరుణ్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ కూసంపూడి మహేష్, జడ్పీటీసీ సభ్యుడు కూసంపూడి రామారావు, ఎంపీపీ దొడ్డా హైమావతి శంకరరావు, నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, ఉడతనేని అప్పారావు, కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, యాగంటి శ్రీను, వల్లభనేని పవన్, ఇమ్మనేని ప్రసాద్, ఎండీ.కమల్‌పాషా, ఫయాజ్‌అలీ,రియాజుద్దీన్ పాల్గొన్నారు.

మహిళా ప్రాంగణంలో అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

ఖమ్మంఖానాపురంహవేలి,జూలై29: నగరంలోని టేకులపల్లిలోగా మహిళా ప్రాంగణంలో మహిళా అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంగణం అధికారి వేల్పుల విజేత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్ టాయిస్ మేకర్ (బొమ్మల తయారి), బాస్కెట్, బ్రూమ్ మేకర్ (బుట్టల, చీపుర్ల తయారి)లలో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు. 10వ తరగతి ఆపైన చదువు ఉండి సంబంధిత ట్రేడ్‌లలో సర్టిఫికెట్, అనుభవం కలిగిన మహిళా అభ్యర్థులు ఆగస్టు 1న మధ్యాహ్నం రెండు గంటలలోపు దరఖాస్తులు మహిళా ప్రాంగణం టేకులపల్లిలో అందించాలని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

పాపయ్యకు కొండబాల, లింగాల నివాళి

వైరా, జూలై29: మండలంలోని రెబ్బవరంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పగడాల పాపయ్య చిత్రపటానికి జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు నివాళులర్పించారు. సోమవారం జరిగిన పాపయ్య దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు తదితరులు కూడా నివాళులర్పించారు.

వాగ్దానాల అమలుకు ఉద్యమిద్దాం

ఏన్కూరు,జూలై29: కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలుకు ఉద్యమించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లానాయకులు ఎస్‌కే లాల్‌మియా కోరారు. సోమవారం ఏన్కూరులో ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 1న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, 8న కలెక్టరేట్ ముట్టడి , 21న ఛలో హైదరాబాదులో ధర్నాలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కొండే వెంకటేశ్వర్లు, ఆనంద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాను సద్వినియోగం చేసుకోవాలి

కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కొప్పుల గోవిందరావు



చింతకాని, జూలై29: అర్హులైన రైతులు రైతుబీమాను సద్వినియోగం చేసుకోవాలని కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు కొప్పుల గోవిందరావు అన్నారు. మండల పరిధిలోని లచ్చగూడెంలో మాట్లాడారు. కమిటీ సభ్యులు రైతబీమాపై ఆయాగ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. రుణమాఫీ అమలుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గొడుగు రమేష్, మేకపోతుల నాగేశ్వరరావు, వంకాయలపాటి చిన్నకృష్ణ, శ్రీరాముల నాగేశ్వరరావు, దమ్మాలపాటి పెద్దమాధవ పాల్గొన్నారు.

కారేపల్లిలో రక్తదాన శిబిరం

కారేపల్లి, జూలై29: మండల కేంద్రంలో అజ్మీర వీరన్న ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆంధ్ర,తెలంగాణ రాష్ట్రలకు చెందిన ఇన్‌కమ్‌ట్యాక్స్ కమిషనర్ లావుడియ్య జీవన్‌లాల్ జన్మదినం సందర్భంగా ఆయన అభిమాని వీరన్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బస్టాండ్‌సెంటర్లో కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

పోలీసు సిబ్బందికి సన్మానం

కారేపల్లి, జూలై29: మండలకేంద్రంలో పనిచేస్తున్న పలువురు కానిస్టేబుళ్లను సిద్దిపేట జిల్లాకేంద్రంలో అదివారం జరిగిన హాఫ్ మారిథాన్ 21.1కిలోమీటర్ల పరుగుపందెంలో ప్రతిభ కనపర్చారు. వారిని సోమవారం పలువురు కాంగ్రెస్ నాయకులు పోలీసు స్టేషన్‌లో సన్మానించారు. రాష్ట్రవ్యాప్తంగా కారేపల్లి మండలానికి పేరు తీసుకొచ్చారని కొనియాడారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై29: ఉపాధ్యాయులను బదిలీ చేసిన ప్రభుత్వం వారిని వెంటనే రిలీవ్‌చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. బదిలీలు నిర్వహించి రిలీవ్ చేయకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారరన్నారు.

ఉద్యోగుల కరువు భత్యాన్ని వెంటనే ప్రకటించాలి

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై29: ఉద్యోగులకు ప్రతి ఆరునెలలకోసారి ఇచ్చే కరువుభత్యాన్ని వెంటనే ప్రకటించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నగరంలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

న్యాయవాది కుటుంబానికి పరామర్శ

ఖమ్మంబైపాస్‌రోడ్,జూలై29: బీజేపీ రాష్ట్రనాయకులు, న్యాయవాది సుగ్గల వెంకటగుప్తా తండ్రి కృష్ణమూర్తి ఇటీవల మృతి చెందారు. దీంతో బీజేపీ నాయకులు సోమవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కృష్ణమూర్తికి మాజీప్రధాని అటల్‌బీహార్ వాజపేయితో మంచి సంబంధాలు కలిగి ఉండేవారని తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, తాన అధ్యక్షుడు కోమటి జయరాం, న్యాయవాది కాటంనేని రమేష్, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, రేఖా సత్యనారాయణ, దీకొండ శ్యామ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్సీ

తల్లాడ,జూలై29: మండల పరిధిలోని మృతుల కుటుంబాలను సోమవారం ఎమ్మెల్సీ తాతా మధు పరామర్శించారు. బిల్లుపాడులో జిల్లా కాంగ్రెస్ నాయకుడు జక్కంపూడి కృష్ణమూర్తి, నూతనకల్‌లో తూము రంగమ్మ కుటుంబాలను ఆయన పరామర్శించారు.